ANN తెలుగు

Follow: @ANNTELUGU

25-09-2026

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 246 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## అక్రమ నీటి దందా..!

### వాల్టా చట్టానికి తూట్లు..!

- రోజుకు 150 నుంచి 200 వందల ట్యాంకర్ల నీటి విక్రయాలు..!
- ఒక్కో ట్యాంకర్‌కు రూ.2 వేల వసూళ్ల పైమాటే..!
- అధికారులను బురిడీ కొట్టిస్తున్న నీటి దొంగలు..!
- వ్యవసాయ అవసరాల కోసం తీసుకున్న విద్యుత్ మీటర్లు..!
- రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే సాగుతున్న లక్షలాది రూపాయల నీటి వ్యాపారం..!
- ఉన్నతాధికారులు స్పందించాలంటున్న స్థానికులు..!

**మహా, మేడిపల్లి:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి మండలం, హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కన పిల్లర్ నంబర్ 134 సమీపంలో నీటి అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. వ్యవసాయ అవస రాల పేరుతో విద్యుత్ కనెక్షన్లు పొంది, భూగర్భ జలాలను వెలికి తీసి భారీగా ట్యాంకర్ల ద్వారా విక్ర యిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి.స్థానికుల సమాచారం ప్రకారం.. సదరు ప్రాంతం నుంచి రోజుకు సుమారు 150 నుంచి 200 ట్యాంకర్ల వరకు నీటిని తర లిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి. ఒక్కో ట్యాంకర్‌కు రూ. 2 వేలకు మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## బైబై గణేషా



- నేడు ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం
- 30వేలకు పైగా విగ్రహాల నిమజ్జనం
- నేటితో ఉత్సవాలకు తెర

02

## జ్ఞానేష్.. రాజీనామా చెయ్



- 48 గంటల్లో చేయకుంటే..
- జంతర్ మంతర్ 2.0
- సీఈసీకి సీజేపీ వార్నింగ్

02

## మోదీ, అమిత్ షా, సీఈసీ దేశ ద్రోహులు



- జ్ఞానేష్ రాజీనామా చేయాల్సిందే
- రాహుల్ గాంధీ డిమాండ్

03

## సంక్రాంతి తర్వాత

# బైపోల్



### ఖైరతాబాద్ వార్ కు సిద్ధమైన పార్టీలు
### దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టు బిగ్ షాక్
### ఎన్నికలకు వెళ్ళాల్సిందేనని ఆదేశం





షెడ్యూల్ వచ్చాక.. ఏ పార్టీనుండి

## పోటీనో చెబుతా

- సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నా
- దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు

**ఢిల్లీ, మహా :** దానం నాగేందర్ కు సుప్రీం కోర్టు బిగ్ షాక్ ఇవ్వగా. ఖైరతాబాద్ బైపోల్ అనివార్యమైంది. దానం నాగేందర్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరగ్గా, ఈ పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. దానం నాగేందర్ తరపున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఈ క్రమంలో దానం పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై విచారణకు న్యాయస్థానం నిరాకరించింది. ఆయనపై అనర్హత వేటు పడిందని.. మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వ్యక్తిగతంగా పార్టీలో చేరితే తప్పు కాదని.. పదవితో పాటు ఫిరాయింపు తప్పేనని ధర్మాసనం తేల్చిచెప్పింది. హైకోర్టు మిగతా 3వ పేజీలో



## తూంకుంట నడిబొడ్డున భారీ

# అక్రమ షెడ్డు..!

### డీమార్ట్ కోసం సాగుతున్న అక్రమ నిర్మాణం..!

అంబేద్కర్ సాక్షిగా.. అది పక్కా

## అక్రమ నిర్మాణమే..!

- జీరో పర్మిషన్ తో కొనసాగుతున్న వైనం...!
- అంతా చైన్‌మెన్ల కనుసన్నల్లోనే సాగుతున్న అక్రమ తంతు..!
- పత్తాలేని టౌన్ ప్లానింగ్ అధికారులు..!
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి..!

02

తూంకుంట నడిబొడ్డున అక్రమంగా నిర్మితమవుతున్న ఓ భారీ షెడ్డు వ్యవహారం స్థానికంగా సంచలనం రేకెత్తిస్తోంది.. ప్రముఖ రిటైల్ దిగ్గజం 'డీమార్ట్' నిర్వహణ కోసం రూపొందుతున్న ఈ అక్రమ షెడ్డు ఎలాంటి అనుమతులు (జీరో పర్మిషన్) లేకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.. అంబేద్కర్ విగ్రహం సమీపంలో నిర్మిస్తున్న ఈ భారీ షెడ్డు పక్కా అక్రమ నిర్మాణమేనంటూ స్థానికులు పేర్కొంటున్నారు.. మున్సిపల్ పర్మిషన్లు, నాలా కన్వర్షన్లు, ఫైర్ ఎన్‌ఓసీలు ఏమీ లేకుండానే డీమార్ట్ అవుట్‌లెట్ పేరిట భారీ షెడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నా అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు పత్తా లేకుండా పోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలు, క్షేత్రస్థాయి చైన్‌మెన్ల కనుసన్నల్లోనే ఈ అక్రమ షెడ్డు నిర్మాణం యథేచ్ఛగా కొనసాగుతుండడంతో ప్రభుత్వ ఖజానాకు రావలసిన రూ. లక్షలాది రూపాయల రాబడి అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తోందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిగతా 2వ పేజీలో

## బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ 2026కు సీఎం రేవంత్ రెడ్డి ఎంపిక

- బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026కు సీఎం రేవంత్ రెడ్డి ఎంపిక
- కేరళ నిలంబూరులో నేడు 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు ప్రదానోత్సవం

03

22ఏ భూములపై తెలంగాణ ప్రభుత్వం

## సంచలన ప్రకటన

**లక్షలాది మందికి ఊరట**

**మహా,హైదరాబాద్ :** 22ఏ భూములపై తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని భూ యజమానులకు ఊరటనిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయా ప్రాంతాల్లోని స్థలాలు లేదా ఆస్తులకు సంబంధించి అధికారిక అనుమతులు ఉన్న వారికి రిజిస్ట్రేషన్ల మార్గం సుగమం చేసింది. జీహెచ్ఎంసీ,హెచ్ఎండీఏ,డీటీసీపీ వంటి అధికారిక సంస్థల నుంచి సరైన అప్రూవల్స్ లేదా అనుమతులు ఉన్న భూములకు ఇకపై ఎలాంటి ఆటంకాలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## వర్షాలు తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలి!



- అధికారులకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు.
- లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలి.
- ఆహారం, మంచినీరు, వైద్యం అందుబాటులో ఉంచాలి.
- పంట నష్టాన్ని కచ్చితంగా అంచనా వేసి రైతులకు అండగా నిలవాలి.

02

## భూ చక్రంలో కేసీఆర్ ఫ్యామిలీ

- కేసీఆర్, కేటీఆర్, హరీష్ ఫామ్ హౌజ్ లతో పాటు బీఆర్ఎస్ నేతల భూములపై విచారణకు కమిటీ
- సీనియర్ ఐఏఎస్ దేవసేన ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ కమిటీ
- మల్లారెడ్డికి మినహాయింపు



02



# తూంకుంట నడిబొడ్డున భారీ అక్రమ షెడ్డు..!




**మహా, హైదరాబాద్:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, శామీర్‌పేట్ మండలం, కీసర సర్కిల్, తూంకుంట డివిజన్ పరిధిలో హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారికి ఆనుకుని భారీ అక్రమ షెడ్డు నిర్మాణం కొనసాగుతుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రద్దీగా ఉండే ప్రధాన రహదారి పక్కనే ఎలాంటి స్పష్టమైన అనుమతులు లేకుండానే భారీ షెడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు ఎకరం విస్తీర్ణంలో జరుగుతున్న నిర్మాణ పనుల తీరు, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటున్న తీరును బట్టి ఇది ప్రముఖ రిటైల్ బిజినెస్ దిగ్గజం 'డీమార్ట్' లేదా తత్సమాన భారీ రిటైల్ ప్లాజా నిర్వహణ కోసమేనని స్పష్టమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. కమర్షియల్ వినియోగానికి అవసరమైన మాస్టర్ ప్లాన్ అనుమతులు, స్ట్రక్చరల్ అప్రూవల్స్ ఏవీ లేకుండానే రోడ్డు పక్కనే బహిరంగంగా పనులు జరిగిపోతుండటం అధికారుల వైఫల్యానికి అద్దం పడుతోందని వారు మండిపడుతున్నారు.

**డీమార్ట్ కోసం సాగుతున్న అక్రమ నిర్మాణం..!**

హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారికి ఆనుకుని భారీ ఇనుప స్తంభాలు, రూఫింగ్ షీట్లతో షెడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తూంకుంట నడిబొడ్డున వాణిజ్య అవసరాల కోసం చేపడుతున్న ఈ భారీ నిర్మాణానికి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే పనులు కొనసాగుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. డీమార్ట్ ఏర్పాటుకు అనువుగా ఈ షెడ్డు నిర్మిస్తున్నట్లు స్థానికంగా జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రధాన రహదారికి ఆనుకుని భారీ నిర్మాణం అనుమతులు లేకుండానే సాగుతున్నా సంబంధిత అధికారులు అడ్డుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**అంబేద్కర్ సాక్షిగా.. అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణం..!**

తూంకుంట ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం సాక్షిగా సమీపంలోనే భారీ షెడ్డు నిర్మాణ పనులు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు కొనసాగుతున్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులు చిన్నపాటి నిర్మాణం చేపట్టినా నిబంధనల పేరుతో నోటీసులు ఇచ్చే అధికారులు.. కళ్లముందే భారీ షెడ్డు నిర్మాణం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, అనుమతులు లేకుండా సాగుతున్న నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు.

**అంతా చైన్‌మెన్ల కనుసన్నల్లోనే..!**

క్షేత్రస్థాయిలో జరిగే ప్రతి నిర్మాణం గురించి సంబంధిత సిబ్బందికి సమాచారం ఉండటం సహజం. అయినప్పటికీ ఈ భారీ నిర్మాణం విషయంలో ఎటువంటి తనిఖీలు నిర్వహించకపోవడం, అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవడం వెనుక కారణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ వ్యవస్థలోని కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది (చైన్‌మెన్లు) కనుసన్నల్లోనే ఈ నిర్మాణం కొనసాగుతోందనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరగాల్సిన చోట నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పత్తాలేని టౌన్ ప్లానింగ్ అధికారులు..!**

అక్రమ నిర్మాణాల నియంత్రణ బాధ్యత వహించే టౌన్ ప్లానింగ్ విభాగం ఈ అంశంలో పూర్తిగా విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకుని భారీ నిర్మాణం జరుగుతున్నా కనీసం నోటీసులు ఇవ్వడం, పనులు నిలిపివేయడం లేదా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడం వంటి చర్యలు కనిపించడం లేదని, అధికారుల పనితీరుపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**సామాన్యుడికి ఒక న్యాయం..**
**బడా బాబులకు మరో న్యాయమా..?**

సామాన్య ప్రజల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేసే అధికారులు, భారీ కమర్షియల్ నిర్మాణాల విషయంలో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్నపాటి ఉల్లంఘనలకే నోటీసులు ఇచ్చే వ్యవస్థ, ఇంత పెద్ద నిర్మాణాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రభుత్వ ఖజానాకు భారీ గండి..!**

కమర్షియల్ నిర్మాణాలకు సంబంధించిన ప్లాన్ అప్రూవల్ ఫీజులు, డెవలప్‌మెంట్ ఛార్జీలు, ఇతర రుసుముల రూపంలో ప్రభుత్వానికి భారీ ఆదాయం రావాల్సి ఉంటుంది. అయితే అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగితే ప్రభుత్వ ఆదాయానికి గండి పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్మాణానికి సంబంధించిన అనుమతులను పరిశీలించి, నిబంధనల ఉల్లంఘన తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారికి ఆనుకుని, తూంకుంట నడిబొడ్డున కొనసాగుతున్న ఈ నిర్మాణ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు

# భూ చక్రంలో కేసీఆర్ ఫ్యామిలీ



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో భూ అక్రమాలపై విచారణ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భూముల అక్రమాలు, అవకతవకలపై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ మేరకు జీవో నంబర్ 134ను ప్రభుత్వం జారీ చేసింది. వివిధ జిల్లాల్లో భూములకు సంబంధించిన అక్రమాలపై విచారణ కమిటీని నియమించింది. అసెంబ్లీ లో ప్రకటించినట్లుగా కేసీఆర్ నివసించే ఎర్రవెల్లి ఫామ్ హౌజ్ సహా బీఆర్ఎస్ కీలక నేతల భూముల కొనుగోళ్ళపై ఈ విచారణ కమిటీ విచారించాలని ప్రభుత్వం పేర్కొంది. ప్రధానంగా కేసీఆర్ ఫ్యామిలీని భూ చక్రంలో బందించే వ్యూహంగా కనబడుతోంది. సీఎం రేవంత్ అసెంబ్లీలో ప్రకటించినట్లుగానే.. పకడ్బందీగా బీఆర్ఎస్ నేతలకు ఉచ్చు బిగించే యోచనలో ఉన్నారు. చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘనలపై ఈ కమిటీ ఆరా తీయనుంది. ఈ అక్రమాలకు బాధ్యులెవరో తేల్చి తగిన చర్యలకు సిఫార్సులు చేయనుంది. ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఏ. శ్రీదేవసేన ఐఏఎస్ ఉన్నారు. కన్వీనర్‌గా రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంతు ఐఏఎస్, జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఐఏఎస్‌తో పాటు సంబంధిత జిల్లాల కలెక్టర్లను కూడా కమిటీ సభ్యులుగా నియమించింది.

**ఈ భూములపై విచారణ చేయనున్న కమిటీ..**

కేసీఆర్ కుటుంబం, కుటుంబ సభ్యులు, అనుచరులకు చెందిన భూములపై ఈ కమిటీ విచారణ చేయనుంది.

ఎర్రవల్లి, సిరివెంకటాపూర్ భూములపై. కమిటీ విచారించాలి.

మాజీ మంత్రి హరీశ్‌రావు కుటుంబం, అనుచరులకు చెందిన రామంచ భూములపై, రంగనాయకసాగర్ సమీపంలోని భూములపై..

మల్లన్నసాగర్ భూసేకరణలో అక్రమాల ఆరోపణలపై విచారించాలి

జన్వాడలో కేటీఆర్ కుటుంబ సభ్యులు, అనుచరులు కొనుగోలు చేసిన భూములపై కమిటీ విచారించనుంది.

మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కుటుంబం, ఆయన అనుచరుల భూములపై కమిటీ విచారించనుంది.

అజీజ్‌నగర్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు భూములపై కమిటీ విచారించనుంది.

అసైన్డ్ భూముల కొనుగోలు, ఆక్రమణలపైనా విచారణ జరగనుంది.

మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు సంబంధించిన ప్రభుత్వ భూముల వ్యవహారంపై, శంకరాహిల్స్ భూముల కొనుగోలు వ్యవహారంపై కమిటీ విచారించనుంది.వట్టినాగులపల్లిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి భూములపై, భూదాన్ భూములపై కమిటీ విచారించనుంది.

జీరా భూముల్లో ఎల్విన్ స్టీఫెన్‌సన్ లీజ్ భూముల రెగ్యులరైజేషన్‌పై కమిటీ విచారించనుంది.

**ధరణి మాడ్యూల్ దుర్వినియోగంపై..**
**విచారించనున్నారు.**

మహబూబ్‌నగర్ జిల్లా గుండేడ్‌లోని పలు సంస్థల వ్యవహారాలపై .. హరీష్‌రావు కుటుంబసభ్యుల భూములపై విచారించనున్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో అసైన్డ్, ప్రభుత్వ భూముల కేటాయింపులపై, మిడ్ మానేర్ రిజర్వాయర్ పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీల వ్యవహారంపైనా ప్రభుత్వం నియమించిన కమిటీ విచారణ చేయనుంది.అవసరమైన రికార్డులు, పత్రాలు, డేటాను కోరే అధికారం ఈ కమిటీకి ప్రభుత్వం అప్పగించింది. ఈ విచారణ నివేదికను త్వరితగతిన ప్రభుత్వానికి కమిటీ సమర్పించనుంది. అయితే కీలకనేతల చుట్టూ ఉచ్చు బిగించిన ప్రభుత్వం మల్లారెడ్డి భూములపై అనేక ఆరోపణలున్నా ఇంకా టచ్ చేయలేదన్న చర్చ జరుగుతోంది.

# జ్ఞానేష్.. రాజీనామా చెయ్

- **48 గంటల్లో చేయకుంటే..**
- **జంతర్ మంతర్ 2.0**
- **సీఈసీకి సీజేపీ వార్నింగ్**

**ఢిల్లీ, మహా.** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘంపై రాజకీయ విమర్శలు మరింత తీవ్రతరమయ్యాయి. ఎస్ఐఆర్ వివాదం నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఈ డిమాండ్ చేశారు. 48 గంటల్లోగా తన పదవిపై నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. జ్ఞానేష్ కుమార్‌పై దీప్కే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయనను దేశానికి, భారత ప్రజాస్వామ్యానికి ముప్పుగా అభివర్ణిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



# వర్షాలు తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలి!

**విజయవాడ, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో అత్యవసర టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి.. సహాయక చర్యలు, ముందస్తు ప్రాణ నష్ట నివారణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలించి వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ఏ అధికారి కూడా అశ్రద్ధ వహించకూడదని స్పష్టం చేశారు.

**'అశ్రద్ధకు తావులేదు'**

వర్షాలు తగ్గే వరకు అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలను ముందుగానే చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**జలాశయాలపై నిరంతర నిఘా**

జలాశయాలు, నదుల్లో పెరుగుతున్న నీటిమట్టాలు, ఇన్‌ఫ్లోలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీఎం ఆదేశించారు. నీటి ప్రవాహంలో మార్పులను ముందుగానే గుర్తించి, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

**లోతట్టు ప్రాంతాల తరలింపు**

లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను వరద పరిస్థితులు తీవ్రతరం కాకముందే పునరావాస కేంద్రాలకు తరలించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలను చివరి నిమిషంలో తరలించే పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**ప్రాణ నష్టం జరగకూడదు**

వరదలు, భారీ వర్షాల కారణంగా ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సీఎం అధికారులకు సూచించారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు**

వరద ముంపునకు గురైన ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించిన అనంతరం అక్కడ వారికి అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని చంద్రబాబు ఆదేశించారు. బాధితులకు నాణ్యమైన ఆహారం, మంచినీరు నిరంతరం అందించాలని స్పష్టం చేశారు.

**వైద్య సేవలు అందుబాటులో ఉండాలి**

పునరావాస కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు. వర్షాలు, వరదల సమయంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్య చర్యలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు**

భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

**పునరుద్ధరణ పనుల్లో వేగం**

చెట్లు కూలడం, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం, రహదారులపై నీరు నిలవడం వంటి సమస్యలు తలెత్తితే సంబంధిత శాఖలు సమన్వయంతో వెంటనే స్పందించాలని సీఎం ఆదేశించారు. ప్రజలకు అత్యవసర సేవలు అందేలా రహదారులు, విద్యుత్, తాగునీటి వ్యవస్థలను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలని సూచించారు.

**రైతులకు అండగా ప్రభుత్వం**

వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టంపై కచ్చితమైన అంచనాలు రూపొందించాలని చంద్రబాబు కలెక్టర్లను ఆదేశించారు. నష్టపోయిన పంటలు, రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని కల్పించాలని స్పష్టం చేశారు.

**కలెక్టర్లకు ప్రత్యక్ష ఆదేశాలు**

వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సీఎం సూచించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ, అవసరమైన చోట తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**అప్రమత్తతే రక్షణ**

తీవ్ర వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండటమే ప్రధాన లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు పూర్తిగా తగ్గే వరకు పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలకే ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు.



# బైబై గణేషా

**నేడు ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం**
**30వేలకు పైగా విగ్రహాల నిమజ్జనం**
**నేటితో ఉత్సవాలకు తెర**

హైదరాబాద్ సిటీ, మహా : ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జనానికి సిద్ధమయ్యాడు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఖైరతాబాద్ గణేషుడి శోభాయాత్ర ప్రారంభం అవుతుందని, 12 నుంచి ఒంటి గంట మధ్యలో నిమజ్జనం పూర్తయ్యే అవకాశం ఉందని ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. శోభాయాత్రలో 200 మంది పోలీసులు విధుల్లో ఉంటారని, అధునాతన డ్రోన్స్‌తో నిఘా ఉంటుందని పేర్కొన్నారు. శోభాయాత్ర వచ్చే రూట్‌లో అన్ని సీసీటీవీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి ఉన్నాయన్నారు. హుస్సేన్ సాగర్ ప్రాంతంలో సుమారు వెయ్యి మంది పోలీసులు విధుల్లో ఉంటారన్నారు. ఇప్పటి వరకూ 30 వేల విగ్రహాలు నిమజ్జనం అయ్యాయని వెల్లడించారు. ఈసారి హుస్సేన్ సాగర్‌కి వచ్చే విగ్రహాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని కోరారు. నిమజ్జనం సాఫీగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి భారీ సూపర్ క్రేన్‌ను జీహెచ్ఎంసీ సిద్ధం చేసింది. గత ఐదేళ్ల నుంచి గణపతి ఉత్సవాల్లో భాగస్వామ్యం అవుతున్న సూపర్ క్రేన్స్ సంస్థ ఈసారి చైనాలో తయారు చేసిన క్రేన్‌ను తీసుకొచ్చింది. వివిధ భారీ ప్రాజెక్టుల్లో ఏడాది అనుభవం ఉన్న సూపర్ క్రేన్ 300 నుంచి 350 టన్నుల బరువు, 80 మీటర్ల ఎత్తు సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. హైడ్రాలిక్ టెక్నాలజీతో ప్రతి అంగుళాన్ని పరిశీలిస్తూ మహాగణపతిని నిమజ్జనం చేస్తామని సూపర్ క్రేన్స్ సంస్థ యజమాని ఆల్తాఫ్ తెలిపారు.



# అక్రమ నీటి దందా..!

( మొదటి పేజీ రువాయి )

పైమాటే వసూలు చేస్తున్నట్లు వారు పేర్కొంటున్నారు. ఈ లెక్కన రోజువారీగా లక్షల రూపాయల విలువైన నీటి వ్యాపారం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బహిరంగ వ్యక్తమవుతున్నాయి.

ఇంత పెద్ద స్థాయిలో ట్యాంకర్ల రాకపోకలు, నీటి వెలికితీత జరుగుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, నీటి పారదల శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**వ్యవసాయ మీటర్లతో నీటి వ్యాపారమా..?**

వ్యవసాయ అవసరాల కోసం మంజూరైన విద్యుత్ కనెక్షన్లు, మీటర్లను ఉపయోగించి భూగర్భ జలాలను వెలికితీస్తున్నారా? అనే అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయానికి ఉద్దేశించిన విద్యుత్ సదుపాయాన్ని ఉపయోగించి నీటిని వెలికితీసి ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తుంటే, ఆ విద్యుత్ వినియోగం నిబంధనలకు అనుగుణంగా ఉందా? అన్నది అధికారుల తనిఖీల్లో తేలాల్సి ఉందని వారు పేర్కొంటున్నారు.

అసలు అక్కడ ఎన్ని విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి? వాటి వినియోగ కేటగిరీ ఏమిటి? బోర్లకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లు ఏ ప్రయోజనం కోసం మంజూరయ్యాయి? ప్రస్తుతం వాటిని ఏ విధంగా ఉపయోగిస్తున్నారు? అనే అంశాలపై విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**వాల్టా చట్టానికి తూట్లు..!**

తెలంగాణ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ (వాల్టా) చట్టం, 2002లో భూగర్భ జలాల సంరక్షణకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. భూగర్భ జలాలను ఇష్టారాజ్యంగా వెలికితీయడం, వాటి వినియోగంపై ప్రభుత్వం విధించే నియంత్రణలను ఉల్లంఘించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా అధిక స్థాయిలో భూగర్భ జలాలను వెలికితీస్తున్న ప్రాంతాల్లో అనుమతులు, రిజిస్ట్రేషన్, నీటి వినియోగ విధానం తదితర అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది.

ప్రత్యేకంగా పెద్ద ఎత్తున భూగర్భ జలాలను వెలికితీసి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, బోరు/బావి వివరాలు, నీటి వినియోగ పరిమాణం, వర్తించే అనుమతులు, వినియోగ ఉద్దేశ్యం తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే చట్టప్రకారం తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**నీటి వినియోగంపై లెక్కలున్నాయా..?**




రోజుకు 150 నుంచి 200 ట్యాంకర్ల వరకు నీటిని తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, అంత పెద్ద మొత్తంలో భూగర్భ జలాలను వెలికితీస్తున్న వైనంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఒక్కో ట్యాంకర్ సామర్థ్యం ఎంత? రోజుకు ఎన్ని ట్యాంకర్లు నింపుతున్నారు? ఎంత పరిమాణంలో నీటిని వెలికితీస్తున్నారు? ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరి ఆధ్వర్యంలో నీటి విక్రయాలు జరుగుతున్నాయి? నీటి విక్రయాలకు సంబంధించి ఏవైనా అనుమతులు లేదా రిజిస్ట్రేషన్లు ఉన్నాయా? వంటి ప్రశ్నలకు సమాధానాలు అధికారుల విచారణలో వెలుగులోకి రావాల్సి ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

**భూగర్భ జలాలపై ప్రభావం ఎంత..?**

నిరంతరం భారీ స్థాయిలో భూగర్భ జలాలను వెలికితీస్తే పరిసర ప్రాంతాల్లోని బోర్లు, బావులపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో భూగర్భ జలమట్టం మరింత పడిపోయే పరిస్థితి ఏర్పడకుండా సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అంతేకాకుండా ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్న నీరు ఏ అవసరాలకు వినియోగిస్తున్నారనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాల్సి ఉంది. తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నట్లయితే నీటి నాణ్యతకు సంబంధించిన పరీక్షలు, సంబంధిత నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపైనా స్పష్టత రావాల్సి ఉంది.

**అధికారుల పాత్రపై అనుమానాలు..**

హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో ట్యాంకర్లు రాకపోకలు సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్న నేపథ్యంలో.. ఇంతకాలంగా సంబంధిత శాఖల దృష్టికి ఈ విషయం రాలేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెవెన్యూ శాఖ, భూగర్భ జలాల శాఖ, విద్యుత్ శాఖ,

**సంయుక్త తనిఖీలకు డిమాండ్..**

సదరు ప్రాంతంలో ఉన్న బోర్లు, విద్యుత్ కనెక్షన్లు, నీటి వెలికితీత పద్ధతి, ట్యాంకర్ల సంఖ్య, నీటి విక్రయాల విధానం, అవసరమైన అనుమతులు తదితర అంశాలపై సమగ్ర సంయుక్త తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.రోజుకు 150 నుంచి 200 ట్యాంకర్ల నీటి తరలింపు జరుగుతోందనే ఆరోపణల నేపథ్యంలో వాస్తవ పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు లేదా భూగర్భ జలాల వెలికితీతలో వాల్టా చట్టం, ఇతర వర్తించే నిబంధనలను ఉల్లంఘించినట్లు విచారణలో తేలితే సంబంధిత బాధ్యులపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పరస్పరం సమన్వయంతో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించేనా..?**

భూగర్భ జలాలు ప్రజలందరికీ సంబంధించిన సహజ వనరు కావడంతో వాటి వినియోగంపై నియంత్రణ, సంరక్షణ అత్యంత కీలకమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు, రెవెన్యూ, భూగర్భ జలాల, విద్యుత్ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పిల్లర్ నంబర్ 134 సమీపంలోని నీటి వెలికితీత కేంద్రాలపై సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సంక్రాంతి తర్వాత బైపోల్



(మొదటి పేజీ తరువాయి )

ఉత్తర్వుల్లో ఎలాంటి జోక్యం చేసుకోమని నిరాకరిస్తూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో బైపోల్ అనివార్యమైంది. వాస్తవానికి సోమవారం సుప్రీంకోర్టులో అడ్మిట్ కాకపోయి ఉంటే మంగళవారం షెడ్యూల్ వచ్చేదని, అక్టోబర్ లో ఎన్నికలు జరిగేవని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే సుప్రీం నిర్ణయంతో ఆరు మాసాల్లో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికలు జరగాల్సి ఉండగా, సంక్రాంతి తర్వాత ఎన్నికలు జరుగుతాయని సమాచారం అందుతోంది. ఉత్తరప్రదేశ్ తో పాటు పంజాబ్, ఇతర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ రానుండగా, వాటితో పాటే ఖైరతాబాద్ బైపోల్ షెడ్యూల్ కూడా రానుంది. సంక్రాంతి తర్వాత నగారా మోగనుంది.

**స్పీకర్ ది రాజ్యాంగ ఉల్లంఘనే**

. ఎమ్మెల్యేగా రాజీనామా చేయకపోయినా లేదా అధికారికంగా రాజీనామా పత్రం ఇవ్వకపోయినా, వేరే రాజకీయ పార్టీ టికెట్‌పై నామినేషన్ వేసి పోటీ చేయడం రాజ్యాంగబద్ధంగా పార్టీని వీడినట్లేనని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని... సుస్పష్టమైన ఆధారాలు (మరో పార్టీ బీఫారమ్‌పై పోటీ చేయడం) ఉన్నప్పుడు స్పీకర్ చర్య తీసుకోకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుందని సుప్రీంకోర్టు తెలిపింది. సుప్రీంలో 'ఘర్ వాపసీ' వాదనలను దానం తరపున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వినిపించారు. దానం తిరిగి సొంత పార్టీకి వచ్చి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని.. ఆయనపై పార్టీ నుంచి ఎలాంటి ఫిర్యాదు లేదని అన్నారు. ఆయనపై అనర్హత వేటు పడకూడదని తెలిపారు. పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడం వేరని, చట్టసభ సభ్యత్వాన్ని నిలబెట్టుకోవడం వేరని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తిరిగి పార్టీలోకి వచ్చినంత మాత్రాన చట్టసభ సభ్యత్వంపై పడే అనర్హత వేటు తొలగిపోదని సుప్రీంకోర్టు పేర్కొంది.

**మరికొందరిపై కూడా ఉంటుందా?**

ఈ అనర్హతల ఎపిసోడ్ దానంతో ముగిసిపోతుందా? కడియం కూడా వర్తిస్తుందా? అనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ మాత్రం పట్టువీడకుండా ప్రయత్నాలు చేస్తోంది. కడియం శ్రీహరి నామినేషన్ పత్రంలో మద్దతుదారుడి సంతకం చేయడం ఇబ్బందికరంగా మారుతుందని, ఆయనపై కూడా చర్యలు ఖాయమని పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే దానికి చాలా సమయం పట్టే అవకాశాలున్నాయి. మూడేళ్ళలో మూడు బైపోల్స్ కాంగ్రెస్ కు వరంగా మారాయి. కాంగ్రెస్ కాన్ఫిడెన్స్ పెంచడంలో బైపోల్స్ దోహదపడుతున్నాయి.

# మోదీ, అమిత్ షా, సీఈసీ దేశ ద్రోహులు

- **జ్ఞానేష్ రాజీనామా చేయాల్సిందే**
- **రాహుల్ గాంధీ డిమాండ్**



**ఢిల్లీ, మహా :** దేశంలో ఓటు హక్కును, ఎన్నికల ప్రక్రియను నాశనం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ 'దేశద్రోహులు' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశానికి వారు చేసిన ద్రోహానికి మోదీ, అమిత్ షాపై విచారణ జరిగి తీరుతుందని స్పష్టం చేశారు. సీఈసీ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో 2024 తర్వాత జరిగిన సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ దేశానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆరోపించారు. జ్ఞానేశ్‌కుమార్‌ను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎంపిక చేశారన్న రాహుల్ రాజ్యాంగంపై దాడులు చేస్తున్నప్పటికీ ఆయన్ను వారు కాపాడుతున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికలకు ముందు సీఈసీపై చట్టప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఓ చట్టం తెచ్చారని రాహుల్ వెల్లడించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయని రాహుల్ ఆరోపించారు. ఈ క్రమంలో ఓటు చోరీ.. చివరకు చట్టం చోరీగా మారుతోందని పేర్కొన్నారు. బీజేపీ 30 నుంచి 50 ఏళ్లపాటు అధికారంలో ఉంటుందని మోదీ, అమిత్ షా చెబుతున్నారని రాజకీయాల్లో ఏ నాయకుడు కూడా ఇలా చెప్పరని వివరించారు. జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి. మీరు చేసిన ఈ పని దేశానికి వ్యతిరేకంగా చేసిన ద్రోహం. ఇది కేవలం ఏదో చిన్న ఎన్నికల రిగ్గింగ్ కాదు. ఇది దేశ రాజ్యాంగంపై జరిగిన దాడి. మనదేశ న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి. పైగా ఓటు హక్కును రక్షించాల్సిన బాధ్యత గల వ్యక్తి మీరే. దేశంలో ప్రజాస్వామ్యం నాశనమవుతుంటే మేం మౌనంగా కూర్చోం. అందుకు బాధ్యులైన వారికి కచ్చితంగా శిక్ష పడుతుంది. ఈరోజు కాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండి అయినా సరే వారు శిక్ష అనుభవించక తప్పదు" అని రాహుల్ గాంధీ అన్నారు.

# టార్గెట్ కేసీఆర్?

- **'బీఆర్ఎస్ అగ్రనేతల భూములపై ఉన్నతస్థాయి విచారణ కమిటీ.**
- **22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం.**
- **16 అంశాలపై దర్యాప్తు**



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో 22ఏ భూముల వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా మరో కీలక మలుపు తిరిగింది. నిషేధిత జాబితాలోని భూములపై శాసనసభలో జరిగిన చర్చకు కొనసాగింపుగా, రాష్ట్ర ప్రభుత్వం పలు జిల్లాల్లోని భూములకు సంబంధించిన ఆరోపణలు, నిబంధనల ఉల్లంఘనలపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 23న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎ. శ్రీదేవసేన అధ్యక్షతన కమిటీ ఏర్పాటైంది. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు కన్వీనర్‌గా, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సభ్యుడిగా వ్యవహరించనున్నారు. విచారణకు సంబంధించిన జిల్లాల కలెక్టర్లు కూడా ఆయా కేసుల పరిధిలో కమిటీ సభ్యులుగా ఉంటారు.

**జీవో నంబర్ 134తో విచారణకు శ్రీకారం**

ప్రభుత్వం సెప్టెంబర్ 23న జారీ చేసిన జీవో నంబర్ 134 ద్వారా ఈ కమిటీని ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 16న శాసనసభలో 22ఏ నిషేధిత ఆస్తుల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో పలు భూములకు సంబంధించిన తీవ్ర ఆరోపణలు, నిబంధనల ఉల్లంఘనల అంశాలు ప్రస్తావనకు రావడంతో తదుపరి పరిపాలనా చర్య అవసరమని ప్రభుత్వం పేర్కొంది. ఆ నేపథ్యంలో వివిధ జిల్లాల్లోని నిర్దిష్ట గ్రామాల్లో ఉన్న భూములకు సంబంధించిన వ్యవహారాలను పరిశీలించేందుకు కమిటీని నియమించింది.

**శ్రీదేవసేన నేతృత్వంలో కమిటీ**

కమిటీకి ఎ. శ్రీదేవసేన అధ్యక్షత వహించనున్నారు. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు కన్వీనర్‌గా ఉంటారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సభ్యుడిగా వ్యవహరిస్తారు. ఏ జిల్లాకు చెందిన భూములపై విచారణ జరుగుతుందో ఆ జిల్లాకు చెందిన కలెక్టర్ కూడా సంబంధిత అంశంలో కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తారు.

**పదహారు భూ వ్యవహారాలపై పరిశీలన**

ప్రభుత్వ ఉత్తర్వులకు అనుబంధంగా ఉన్న జాబితాలో మొత్తం 16 భూ వ్యవహారాలను విచారణకు చేర్చినట్లు ది హిందూ, దక్షిణ్ ఫస్ట్, టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదికలు వెల్లడించాయి. సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని వివిధ గ్రామాలకు సంబంధించిన భూములు ఈ పరిశీలన పరిధిలో ఉన్నాయి. ఇందులో కేసీఆర్ కుటుంబానికి సంబంధించినట్లు పేర్కొన్న భూములతో పాటు కేటీఆర్ కుటుంబ సభ్యులు, హరీశ్‌రావు కుటుంబ సభ్యులు, ఇతర బీఆర్ఎస్ నేతలు, వారి కుటుంబ సభ్యులు, అనుచరులకు సంబంధించినట్లు పేర్కొన్న భూముల అంశాలు ఉన్నాయి.

**ఎర్రవల్లి.. మర్కుక్.. వెంకటాపూర్‌పై దృష్టి**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి, మర్కుక్, వెంకటాపూర్ శివారు ప్రాంతాల్లో కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులకు సంబంధించినట్లు ప్రభుత్వం పేర్కొన్న భూములు విచారణ పరిధిలోకి వచ్చాయి. ఈ ప్రాంతాల్లోని భూముల రికార్డులు, వాటి కొనుగోళ్లు, భూముల స్వభావం, సంబంధిత ప్రభుత్వ నిబంధనల అమలు వంటి అంశాలను కమిటీ పరిశీలించనుంది.

**రికార్డుల్లో 440 ఎకరాల అంశం**

సెప్టెంబర్ 16న శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనల్లో కేసీఆర్ కుటుంబానికి చెందినట్లు పేర్కొన్న భూముల విస్తీర్ణం సుమారు 440 ఎకరాలుగా ప్రస్తావనకు వచ్చింది. తొమ్మిది జిల్లాలు, 24 మండలాలు, 31 గ్రామాల్లో ఈ భూములు ఉన్నట్లు ప్రభుత్వం సభలో వివరాలు ఉంచిందని నివేదికలు తెలిపాయి. ఇవి ముఖ్యమంత్రి సభలో చేసిన ఆరోపణలు, ప్రభుత్వం ఉంచిన వివరాలు మాత్రమేనని, వాటిపై తుది నిర్ధారణ విచారణ అనంతరం జరగాల్సి ఉంది.

**ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ 388 ఎకరాల అంశం**

ఎర్రవల్లిలో కేసీఆర్ కుటుంబానికి చెందినదిగా పేర్కొన్న సుమారు 700 ఎకరాల ఫామ్‌హౌస్ చుట్టూ 388 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు ముఖ్యమంత్రి సభలో పేర్కొన్నారని దక్షిణ్ ఫస్ట్ నివేదించింది. ఈ అంశం కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ పరిధిలోకి వచ్చిన భూ వ్యవహారాలతో సంబంధం కలిగి ఉంది. అయితే ఈ వివరాలు ప్రభుత్వం చేసిన ఆరోపణల ఆధారంగా వచ్చినవే తప్ప, కమిటీ తుది నిర్ధారణగా పరిగణించరాదు.

**కేటీఆర్ కుటుంబానికి చెందినట్లు పేర్కొన్న జన్వాడ భూములు**

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలో శతభిష ఆగ్రోతో పాటు ఇతర సంస్థలు, వ్యక్తుల పేరిట ఉన్న భూములను కూడా విచారణకు చేర్చారు. ఈ భూములు కేటీఆర్ కుటుంబ సభ్యులు, అనుచరులకు సంబంధించినవిగా ప్రభుత్వం పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి. భూముల కొనుగోలు, వాటి స్వభావం, యాజమాన్య బదలాయింపులు, సంబంధిత రికార్డులు తదితర అంశాలను కమిటీ పరిశీలించనుంది.

**రంగనాయకసాగర్ పక్కన హరీశ్‌రావు కుటుంబ భూములు**

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామంలో రంగనాయకసాగర్ రిజర్వాయర్ సమీపంలోని హరీశ్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులకు సంబంధించినట్లు పేర్కొన్న భూములు విచారణ జాబితాలో ఉన్నాయి. అదే విధంగా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌కు సంబంధించిన భూముల అంశం కూడా పరిశీలన పరిధిలోకి వచ్చింది.

**వెలికట్టలో సర్వే నంబర్ 271**

సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్ట గ్రామంలోని సర్వే నంబర్ 271లో ఎం. హనుమంతరావు కొనుగోలు చేసినట్లు పేర్కొన్న అసైన్డ్ భూమి కూడా విచారణ జాబితాలో ఉంది. సెప్టెంబర్ 18న కాంగ్రెస్ నేతల బృందం ఈ ప్రాంతాన్ని సందర్శించి భూ రికార్డులు, పహాణీలు, పట్టాదారు వివరాలను పరిశీలించినట్లు వార్తలు వచ్చాయి. సుమారు 6 ఎకరాల 2 గుంటల భూమి విషయాన్ని వారు అధికారుల వద్ద ప్రస్తావించారు.

**మల్లన్నసాగర్ భూసేకరణపై విచారణ**

మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం జరిగిన భూసేకరణకు సంబంధించిన అంశాలు కూడా కమిటీ పరిధిలో ఉన్నాయి. భూసేకరణ, పరిహారం, పునరావాసం, పునరావాస ప్యాకేజీలకు సంబంధించిన ఆరోపణలను పరిశీలించనుంది. గతంలో ఈ వ్యవహారాలకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత ఎస్. రామలింగారెడ్డి తదితరుల పేర్లు ప్రస్తావనకు వచ్చినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి.

**జగదీశ్‌రెడ్డి కుటుంబ భూములు**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూరు ప్రాంతంలో మాజీ మంత్రి జి. జగదీశ్వర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులకు సంబంధించినట్లు పేర్కొన్న భూములు కూడా కమిటీ పరిశీలనలో ఉన్నాయి. ఈ భూముల కొనుగోళ్లు, వాటి స్వభావం, సంబంధిత నిబంధనలు, రికార్డులు వంటి అంశాలపై విచారణ జరగనుంది.

**గంగుల కమలాకర్‌కు సంబంధించిన భూములు**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ తదితరులకు సంబంధించినట్లు పేర్కొన్న ప్రభుత్వ భూముల అంశం కూడా విచారణ పరిధిలోకి వచ్చింది. అలాగే గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని శంకర హిల్స్ ప్రాంతానికి సంబంధించిన భూముల అంశాన్ని కూడా కమిటీ పరిశీలించనుంది. ప్రభుత్వ భూముల కొనుగోలు, ఆక్రమణ, భూముల వర్గీకరణలో మార్పులు జరిగాయా అన్న అంశాలపై పరిశీలన ఉంటుందని ప్రభుత్వం పేర్కొన్న పరిధిలో తెలుస్తోంది.

వట్టినాగులపల్లి భూదాన్ భూముల వ్యవహారం

వట్టినాగులపల్లిలో భూదాన్ భూముల కొనుగోలుకు సంబంధించిన ఆరోపణలు కూడా విచారణ జాబితాలో ఉన్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరు ఈ వ్యవహారంలో ప్రభుత్వం ప్రస్తావించింది. అయితే ఈ భూమిపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి గతంలో తన వాదనను వెల్లడించారు. 2026 మే 15న తెలంగాణ హైకోర్టులో నమోదైన కేసులో ఆయన సర్వే నంబర్ 188/1/2లోని 1 ఎకరం 10 గుంటల భూమి భూదాన్ భూమి కాదని, అది పట్టా భూమి అని పేర్కొన్న విషయం రికార్డులో ఉంది. ప్రభుత్వ తరపు న్యాయవాది కూడా ఆ సమయంలో అధికారులు తన భూమిలో జోక్యం చేసుకోవడం లేదని తెలిపిన అనంతరం ఆ పిటిషన్ పరిష్కారమైంది.

**అజీజ్‌నగర్‌లో పైలట్ రోహిత్‌రెడ్డి భూములు**

మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డికి సంబంధించినట్లు పేర్కొన్న అసైన్డ్ భూముల అంశం కూడా కమిటీ జాబితాలో ఉంది. అసైన్డ్ భూముల కొనుగోలు, వాటి బదలాయింపు, భూముల వర్గీకరణలో మార్పులు వంటి అంశాలను పరిశీలించనున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా వచ్చిన నివేదికలు పేర్కొన్నాయి.

**ఫామ్‌హౌస్‌లు.. చెరువులు.. నీటి మట్టాలు**

మొయినాబాద్, అజీజ్‌నగర్ ప్రాంతాల్లో ఫామ్‌హౌస్‌లకు సంబంధించిన భూములపై గత కొద్ది రోజులుగా రాజకీయ ఆరోపణలు కొనసాగుతున్నాయి. సెప్టెంబర్ 20న కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం అజీజ్‌నగర్, మొయినాబాద్ ప్రాంతాల్లో హరీశ్‌రావు, పైలట్ రోహిత్‌రెడ్డికి చెందినవిగా వారు పేర్కొన్న ఫామ్‌హౌస్‌ల పరిసరాలను సందర్శించింది. ఒక ఫామ్‌హౌస్ చెరువు సమీపంలో, పూర్తి నీటిమట్ట ప్రాంతంలో ఉందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఈ అంశాలు కూడా ఇప్పుడు భూముల వాస్తవ స్థితి, రికార్డులు, అనుమతుల పరిశీలనలో భాగంగా ప్రస్తావనకు వస్తున్నాయి.

**సిరిసిల్లలో వేల ఎకరాల భూముల వ్యవహారం**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఇతర మండలాల్లో అసైన్డ్ భూముల కొనుగోళ్లు, ప్రభుత్వ భూముల కేటాయింపులకు సంబంధించిన ఆరోపణలను కూడా కమిటీ పరిశీలించనుంది. ఈ ప్రాంతంలో భూముల బదలాయింపులు, ప్రభుత్వ భూముల కేటాయింపులు, నిషేధిత భూముల జాబితాలో జరిగిన మార్పులకు సంబంధించిన అంశాలు గతంలో శాసనసభ చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి.



# షెడ్యూల్ వచ్చాక.. ఏ పార్టీనుండి పోటీనో చెబుతా

- **సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నా**
- **దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్:** సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును తాను స్వాగతిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. లీగల్ ఫైట్ చేయడంలో తప్పు లేదంటూ వ్యాఖ్యలు చేశారు. తాను ప్రజల మనిషి అని.. తనకు ప్రజల మద్దతు ఉంటుందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దానం నాగేందర్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాను. మళ్ళీ పోటీ చేయడానికి కోర్టు అవకాశం ఇచ్చింది. ప్రజా క్షేత్రంలో తేల్చుకుంటాను. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తాను. ప్రజల ఆశీస్సులతో ఉప ఎన్నికల్లో పోటీ చేస్తా. ఎంపీగా పోటీ చేసినప్పుడే ఇలాంటి పరిస్థితులు వస్తాయని అనుకున్నా. పదో షెడ్యూల్ ప్రకారం ఊరట లభిస్తుంది అనుకున్నాను. కానీ, అలా జరగలేదు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉన్నా. నేను ప్రజల మనిషిని.. ప్రజల మద్దతు నాకు ఉంటుంది. ఖైరతాబాద్ ప్రజలకు నిరంతరం సేవ చేసుకుంటూ వచ్చాను. నాకు ప్రజాబలం ఉంది. సిటీ మొత్తం అభివృద్ధి చేయాలని ఎంపీగా పోటీ చేశాను. కానీ, విజయం దక్కలేదు. నేను ఎవ్వరినీ కలవలేదు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరాను. ఖైరతాబాద్ వినాయక నిమజ్జనం ఏర్పాట్లలో బిజీగా ఉన్నా. న్యాయపోరాటంతో ఆఖరి ప్రయత్నం చేశా' అని చెప్పుకొచ్చారు. టికెట్ వచ్చాక అని వివరాలను చెబుతాను. షెడ్యూల్ వచ్చిన తర్వాత రాజకీయం గురించి మాట్లాడుతాను. షెడ్యూల్ వచ్చాక ఏ పార్టీ నుంచి పోటీ అన్నది చెబుతాను. నా అనుచరులు అంతా పోటీ చేయడానికి మద్దతు ఇచ్చారు. ప్రజల మధ్య ఉండే నేతకు ఏ పార్టీలో ఉన్నా మద్దతు ఉంటుంది. కాంగ్రెస్ అన్ని పథకాలు అమలు చేస్తుంది. రోజుకు సీఎం 18 గంటలు పనిచేస్తున్నారు. సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీకి లాభం చేస్తాయి. హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత నేను ఇంతవరకు సీఎంను కలవలేదు. ఉప ఎన్నిక వచ్చినప్పుడు నిధులు ఎక్కువ వస్తాయి... నా నియోజకవర్గం ఇంకా అభివృద్ధి చెందుతుంది. ఎవరు ఎన్ని మాట్లాడినా ఎన్నికల్లో రిజల్ట్స్ చూపిస్తా' అని కామెంట్స్ చేశారు.

# ఆదిలాబాద్ జిల్లా యువతి అరుదైన ఘనత

**మిస్ ఎర్త్ వాటర్ ఇండియా 2026 గా ప్రీతి ముండే**



**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లాకు చెందిన యువతి అరుదైన ఘనత సాధించింది. ఇంద్రవెల్లి మండలంలో హీరాపూర్ యువతి ప్రీతి ముండే మిస్ ఎర్త్ వాటర్ ఇండియా 2026 కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. రాజస్థాన్ లోని జైపూర్ లో జరిగిన పోటీలలో మిస్ ఎర్త్ వాటర్ ఇండియా కిరీటం దక్కించుకున్నారు. ఒక సాధారణ పల్లెటూరి నుంచి వచ్చిన ప్రీతి ఈ ఘనత సాధించడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి హైదరాబాద్‌కు వచ్చి పాఠశాల విద్యార్థులకు యోగా టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ పోటీల్లో మిస్ కంజీనియాలిటీ 2026 టైటిల్‌ను కూడా ఆమె సొంతం చేసుకోవడం విశేషం. యోగా ట్రైనర్ గా ప్రయాణం ప్రారంభించి, జాతీయ స్థాయి అందాల పోటీల వరకు ఎదిగి ఈ ప్రతిష్టాత్మక కిరీటాన్ని దక్కించుకున్నారు. యవతికి అరుదైన పురస్కారం రావడంపై గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు.



# బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ 2026కు సీఎం రేవంత్ రెడ్డి ఎంపిక

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ 2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ 2026 (ఉత్తమ ప్రజా సేవకుడు) అవార్డుకు ఎంపికయ్యారు. కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టి గల నాయకత్వానికి గానూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపికకు ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ జ్యూరీగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను ఈ సందర్భంగా జ్యూరీ ప్రత్యేకంగా కొనియాడింది. ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్, ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేస్తారు. ఆర్యదాన్ ముహమ్మద్ కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత. 8 సార్లు ఎమ్మెల్యేగా, కేరళలోని వివిధ మంత్రివర్గాల్లో నాలుగు సార్లు వివిధ శాఖలకు మంత్రిగా సేవలు అందించారు. రాజనీతిజ్ఞుడైన ఆర్యదాన్ ముహమ్మద్ దూరదృష్టి గల నేతగా, అద్భుతమైన పార్లమెంటేరియన్ గా, సమర్థుడైన పాలకునిగా, కార్మిక వర్గ ఛాంపియన్‌గా కేరళ ప్రజల మదిలో నిలిచిపోయారు. నిజాయితీ, లౌకిక విలువలు, ప్రజా సంక్షేమ పాలనకు మారుపేరుగా ఆర్యదాన్ ముహమ్మద్ గుర్తింపు పొందారు.



# వెళ్ళిరావయ్యా.. బొజ్జ గణపయ్య

## ట్యాంక్ బండ్ పై కోలాహలం
## సిటీలో ఎక్కడచూసినా.. గణనాధుని సందడే

హైదరాబాద్ సిటీ, మహా : హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డు మరియు హుస్సేన్ సాగర్ తీరం వద్ద గణేష్ నిమజ్జన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం సాయంత్రానికి 30వేలకు పైగా విగ్రహాలు నిమజ్జనం జరగ్గా, శుక్రవారం రాత్రికి నిమజ్జనాలు పూర్తి కానున్నాయి. ఈసారి గత ఏడాదికన్నా విగ్రహాల సంఖ్య పెరిగిందని అధికారవర్గాలు తెలిపాయి. ఎక్కడ చూసినా గణనాధుడి కోలాహలమే. భక్తుల రద్దడిని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో భారీ క్రేన్లను ఏర్పాటు చేసి నిమజ్జన ప్రక్రియను కొనసాగిస్తున్నారు. హైడ్రా ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.














# సమ్మక్క వారసత్వాన్ని అవహేలన చేసిన కాసర్ల శ్యాం. శ్రీకాంత్ ఒదెల

వ్యవస్థీ క్రుతిమైన నేరమయ ప్రపంచానికి రెండు పార్శ్వాలు ఉంటాయి ఒకటి కంటికి కనిపించేది,చరిత్ర లో నమోదయినది. రెండో ప్రపంచం మనకు అసలే తెలియదు. నిజానికి అదే నిజమైన ప్రపంచం వినికిడి జ్ఞానాల మీద తీర్పులు ఇవ్వడం కుల మత ప్రాంతీయ ప్రాతిపదికన ప్రాధాన్యత తరాలుగా మన ముందు నడుస్తున్న జగన్నాటకం కానీ ఈ దేశం లో జరిగిన ప్రతి మార్పు వెనక పేరు వూరు లేనివాళ్ళ త్యాగాల గురించి మనకు అసలే పట్టదు. చరిత్రలో ప్రతి ప్రత్యామ్నాయ మార్పు వెనక ఆధునికత ను అర్ధం చెసుకున దోపిడీ సమాజాలు, కులాలు ,సమూహాలు ముందు తరం వేసిన త్యాగాల బాటను చెరిపేసి వంచక చరిత్ర రాయడం మొదలు పెడతారు దానికి మలి విడత తెలంగాణ ప్రత్యక్ష సాక్ష్యం. శ్రీకాకుళ, బస్తర్ జనతన సర్కార్ కూడా అనామక త్యాగాల పునాది మీదనే నిలబడ్డది. అవి ప్రజా పునాది ఉన్న ఉద్యమాలు కనుక బిర్సా ముండా రాంజీ గోండ్, కొమురం భీమ్, పాపన్న లను సజీవంగా తమ జ్ఞాపకాల లో పోరాటాల లో కాపాడుకున్నారు. అయినా వారి స్మరణ ఏదో ఒక రూపం లో మన తలపుల లో సజీవంగా కాపాడుకున్నా జంగల్ మహల్ చౌరాస్, బస్తర్ ముండాస్, భాగల్పూర్ సంతాల్స్, భిల్స్, కోయ, గోండ్, మహార్, చమార్ నోటికి పలకడం కూడా సాధ్యం కాని పదుల సంఖ్యలో అదృశ్య, అస్పృశ్య, అవాచ్య శక్తులు విముక్తి పోరాటాల లో తమ నెత్తురు సాకబోసారు. అందులో ఎందరో అనామకంగా దుమ్ములో కలిసి పోయారు . వాళ్ళంతా తమ జీవితాన్ని పోరాటానికే ఇచ్చి ఉందొ లేదో తెలియని వచ్చే జన్మ తమది అనుకున్నారు ఆ కోవలోనే శ్రీకాంత్ ఓదెల ది పారడైస్ సినిమా. ఆయన ఎంచుకున్న లక్ష్యం గొప్పదే కానీ చెపాల్సిన అంశాన్ని వికృతం చేసాడు. ఇందులో అందరికీ ఆక్షేపణ అంశం ప్రిమిటివ్ తెగల లో ఉన్న మితిమీరిన హింస. అందుకే జాతీయ పోరాటం మొదలవడానికన్నా దశాబ్దాల ముందే ఈ ప్రిమిటివ్ తెగలు రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని గల్లా పట్టుకుని నిలేసాయి . నిజానికి ఆ తెగలు రాజేసిన పౌరుషమే ఇక్కడ జాతీయ పోరాటం, స్వాభిమాన, విప్లవ పోరాటాలు గా వాళ్ళ వారసత్వాన్ని కొనసాగించాయి. ఇంకొంచం చరిత్రలోకి ముందుకు వెళితే కప్పం కట్టమని ఒత్తిడి చేసి అరిగోస పెట్టిన ప్రతాప రుద్రుని మీద సమక్క ఆవిడ బిడ్డ , మరియు పగిడిద్ద రాజు లు సంపెంగ వాగులో అవనతం అయి ఐతిహ్యామై విరాజిల్లు తున్నారు. ఈ సినిమా కు పారడైస్ అనే పేరు పెట్టడమే గాడి తప్పిన అంశం. సమ్మక్క వారసత్వ పౌరుషాన్ని ఎత్తి పట్టే ధైర్యం లేకనే జడల పోరగాన్ని సృష్టించాడు. వాడి బలమైె న స్వగతాన్ని ఒదెల అనే అజ్ఞాని జుగుప్సాకరంగా మార్చాడు. దర్వాజల అనవాల్లె లేని సవారీ తెగను జాతికోసం దేశం కోసం పోరాడిన సవారీలను హంతకులుగా కూనీ కోర్లు గా, తాగుబోతులుగా వ్యభిచారులు గా మార్చాడు దర్శకుడు ఇందులో జడల గాడి పుటక మీద కొట్టిన వాళ్ళ మీద, కడుపు మీద కొట్టిన వాళ్ళ మీద తన జాతి పూర్వీకుల ఆనవాళ్ళు చెరిపేసిన చోట ప్రత్యామ్నాయ చరిత్ర రచనకు పెద్ద పెద్ద డైలాగ్ లు రాసుకున్నాడు. నిజానికి ఈ ప్రిమిటివ్ తెగల బ్రతుకులను మెల్ గిబ్సన్ అపొక లిప్టో అంతరించి పోతున్న ఆదిమవాసుల బ్రతుకుల కన్నా బలమైన జీవితాలు. ఇక్కడ బిర్సా ముండాలు, రాంజీ గోండ్ పాపన్న బల్మోర్ బాలమ్మ అపొక లిప్టో కన్నా బలమైన వాళ్ళు . ఆ ప్రయత్నం అసలు ఈ దేశం లో మొదలే కాలేదు. ఈ తెగల ఔన్నత్యాన్ని చెప్పడానికి గిబ్సన్ కుంటా కింటే లో, గాంధీ నో, నెల్సన్ మండేలా నో ఫాన్సీ కోసం వాడుకోలేదు. వాళ్ళ జీవితాలను చదివి అర్ధం చేసుకుని వాళ్ళ పోరాటాన్ని దృశ్య మానం చేసాడు. ఆ పని తమిళ సమాజం చేస్తోంది. రంజిత్, సెల్వ రాజ్ రాజేస్తున మరో వెండితెర విప్లవాన్ని అపహాస్యం చేస్తోంది తెలుగు సినిమా. తమ జాతి ఉనికి కోసం దేశ విముక్తి కోసం ప్రాణాలు సాక బోసిన సవారీలకు అన్యాయం చేసాడు. సవారీల గుండె మీద తన్ని జెడల గాడిమీద బుజం మీద చెయ్యి వేసిన పని దర్శకుడే చేసాడు . ఆడది ఉన్నది పైట పరవడానికే ఉన్నది అని నిరూపించిన వందేళ్ళ సినిమా వేసిన వికృత దారిలోనే నడిచాడు దర్శకుడు. “ఆగస్టు పది హేను గుర్తుకు వస్తే అన్నం సహించదు” అన్న వాక్యాన్ని అక్షరాలా తనువంతా నింపుకున్న జెడల ను హంతక జెడల నాగరాజుగా, నయీంగా, బ్లేడ్ బాబ్జీ గా మార్చాడు శ్రీకాంత్ ఒదెల. ముందు ఇతన్ని అరువుతెచ్చుకున్న వాక్యాలు కల్పిత హీరోలు కాకుండా చరిత్ర చదవడం నేర్చుకోమని చెప్పాలి అనిపించింది. నిజానికి సమ్మక్క వారసత్వాన్ని అవహేలన చేస్తున్న కాసర్ల శ్యాం మరియు శ్రీకాంత్ ఒదెల. ఈ పోరాట యోధులకు క్షమాపణ చెప్పాలి. నెత్తుటి గింజల పైన మొలిసిన గద్దల నెత్తులు నరికిన కాకుల రాజ్యం ఎండిపోయిన బొక్కలే ఎగిరే జెండా కర్రలు మాడి పోయిన డొక్కలే మొగేటి నగారాలు మీరు రాసిన డైలాగ్ లు దియేటర్ లో తాత్కాలిక పూనకం రప్పించింది కానీ వాళ్ళ చరిత్ర విన్న దర్వాజ వాళ్ళ కోసం తలుపులు తెరవక పోగా వాళ్ళు కుత్తికలు కోసే హంతకులే అని శ్రీకాంత్ ఒదెల కాసర్ల శ్యాం సవారీల



నెత్తుటి చరిత్ర ను అమానవీయ కోణం లో రాసుకున్నారు. అరువు తెచ్చుకున్న డైలాగ్ లకు నాలుగు కాసులు రాలతాయి ఏమో గానీ చరిత్ర క్షమించదు

**- గుర్రం సీతారాములు**



# ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలే లక్ష్యం

- ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి.. నిర్లక్ష్యానికి తావులేదు
- నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా..
- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా

**పెద్దపల్లి, మహా:** ప్రజలకు మెరుగైన, నాణ్యమైన పోలీస్ సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. గురువారం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, వివిధ విభాగాలను పరిశీలించారు. కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్‌లో వివరాల నమోదు, కేసుల అప్‌లోడ్‌పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు, వాటి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఎస్ఐ చంద్రకుమార్‌తో సమీక్షించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్‌లో ఉన్న వ్యక్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. 5S విధానాన్ని అమలు చేస్తూ పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను సానుభూతితో విని వేగంగా స్పందించాలని తెలిపారు. అనంతరం సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, మరిన్ని ప్రాంతాల్లో కెమెరాల ఏర్పాటుకు ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. రాజీవ్ రహదారిపై ప్రమాదకర ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# రిమ్స్‌లో మాతా శిశు సంరక్షణకు పెద్ద పీట

- భద్రతా ప్రమాణాలు మరింత పటిష్టం
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత
- చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులతో కలిసి రిమ్స్‌ను సందర్శించిన కలెక్టర్



**ఆదిలాబాద్ మహా:** రిమ్స్ ఆసుపత్రిలో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్టం చేస్తున్నామని , మాతా శిశు మరణాలను తగ్గించడంతో పాటు, నవజాత శిశువులకు అత్యుత్తమ వైద్య సేవలు స్థానికంగానే అందేలా రిమ్స్‌లో ప్రత్యేక ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి తెలిపారు. గురువారం చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులతో కలిసి రిమ్స్‌ను సందర్శించిన కలెక్టర్, క్రిటికల్ కేర్ వార్డు, పీడియాట్రిక్స్ విభాగం, మొదటి అంతస్తులోని ఐసీయూ వార్డుతో పాటు పలు విభాగాలను పరిశీలించారు. ఎయిమ్స్ వైద్యులతో కలిసి చిన్నారులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, సిబ్బంది పనితీరు, అత్యవసర వైద్య సదుపాయాలను సమీక్షించారు. రిమ్స్ పీడియాట్రిక్స్ విభాగంలో నవజాత శిశువుల కోసం ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 34 బెడ్లను ఏర్పాటు చేయగా, 23 బెడ్లకు డైరెక్ట్ ఆక్సిజన్ సదుపాయం, 11 బెడ్లకు సిపిఏపి సపోర్ట్ అందుబాటులో ఉందన్నారు. రిమ్స్ అగ్ని ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని భరోసా ఇచ్చారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కొంతమంది చిన్నారులు కోలుకుని ఇప్పటికే డిశ్చార్జ్ అయ్యారని, మరికొందరు వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఆరోగ్యంగా నిలకడగా ఉన్నారని కలెక్టర్ తెలిపారు. అత్యవసరంగా మెరుగైన వైద్యం అవసరమైన చిన్నారులను సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ద్వారా హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. బుధవారం రాత్రి 15 మంది చిన్నారుల్లో ఏడుగురిని హైదరాబాద్‌కు సురక్షితంగా తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

**కమీషన్ సభ్యుల విచారం**

రిమ్స్ అగ్ని ప్రమాద ఘటనపై తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు మరిపెల్లి చందన, ప్రేమలత అగర్వాల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం వారు రిమ్స్‌ను సందర్శించి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.ప్రమాదంలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేతను వారు ప్రస్తావించారు. చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని మహిళా కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు.అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు మహిళా కమిషన్ తరపున పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, డీడబ్ల్యూఓ మిల్కా, బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, వైద్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మల్లికార్జున నగర్‌లో అన్నప్రసాదం

**ఎస్ఆర్ఎస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక పూజలు**

**కుషాయిగూడ, మహా :** వినాయక చవితి సందర్భంగా శక్తిసాయినగర్ డివిజన్ మల్లికార్జున నగర్‌లో ఎస్ఆర్ఎస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంగిశెట్టి రవీంద్ర సాగర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌని ప్రదీప్‌సాగర్, అఖిలాసాగర్ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకుడు ఎన్.వీ.ఎస్.ఎస్. ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. సుమారు 4 వేల మందికి అన్నప్రసాదం అందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమానికి స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఈ నెల 30న సీఎం చేతుల మీదుగా కలెక్టరేట్ ప్రారంభోత్సవం



**కరీంనగర్, మహా:** కరీంనగర్ నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఈ నెల 30న సీఎం ఎ. రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పండుగ వాతావరణంలో ప్రారంభించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం, కార్యాలయ భవనం, పరిసరాలను సుందరంగా అలంకరించి స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎమ్మెల్యేలు, కలెక్టర్, పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం నూతన కలెక్టరేట్, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ప్రాంగణం, సమావేశ మందిరం, సీఎం పర్యటించే ప్రాంతాలు, హెలిప్యాడ్‌ను పరిశీలించారు. సీఎం ప్రారంభోత్సవం అనంతరం జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్లనున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

# డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి

- కేఆర్కే కాలనీలో గల సముదాయాన్ని సందర్శించిన కలెక్టర్
- పెండింగ్ పనులు మౌలిక వసతుల పరిశీలన



ఆదిలాబాద్ మహా: కేఆర్కే కాలనీలోని రెండు పడక గదుల ఇళ్లలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.గురువారం కేఆర్కే కాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్లలో శానిటేషన్, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, వాటిని వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట్ల తక్షణ చర్యలు చేపట్టి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# పవర్‌లిఫ్టర్ అజయ్ బెనర్జీకి ఎమ్మెల్యే అభినందనలు

**కుషాయిగూడ, మహా :** అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏడబ్ల్యూపీసీ వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సాధించిన పవర్‌లిఫ్టర్ అజయ్ బెనర్జీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. అజయ్ బెనర్జీ సాధించిన విజయాలు మల్లాపూర్‌తో పాటు తెలంగాణ, దేశానికి గర్వకారణమని ఎమ్మెల్యే అన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. రాబోయే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో అజయ్ బెనర్జీ మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, సీనియర్ నాయకుడు సాయి జెన్ శేఖర్, గుల్మోహర్ గార్డెన్స్ జీ బ్లాక్ వాసులు ఎండీ ఉస్మాన్, దుర్గాప్రసాద్, అధ్యక్షుడు ధనంజయ్ కులకర్ణి, లక్ష్మీచరణ్, నూతన లక్ష్మి, ప్రభాకర్, ముఖేష్ అగర్వాల్, సంజీత్, పవన్ శర్మ, వంశీకృష్ణ, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, లింగాల రాజేష్ గౌడ్, రమణ పాల్గొన్నారు.



# సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే మా ధ్యేయం

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియా కే.కే5 గని ఆవరణలో గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 27న హైదరాబాదులో ఆర్ఎల్‌సీ సమక్షంలో యాజమాన్యంతో జరిగిన చర్చల్లో 32 డిమాండ్లలో 23 డిమాండ్లు సాధించుకోవడం సింగరేణి చరిత్రలోనే చారిత్రాత్మకమని పేర్కొన్నారు. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న పెర్క్స్ పై ఆదాయపు పన్ను (ఇన్ కమ్ టాక్స్) మినహాయింపు సాధించడంతోపాటు, దసరా పండుగ నాటికి లాభాల్లో వాటా ఇప్పించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను, వేజ్ బోర్డు ఏర్పాటులో విధిస్తున్న నిబంధనలను ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇకపోతే దీపావళి బోనస్ (పి.ఎల్.ఆర్) గత సంవత్సరం కంటే మెరుగ్గా సాధిస్తామని, సింగరేణికి రావాల్సిన 54 వేల కోట్ల రూపాయల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనాదుని సుదర్శన్, సోమిశెట్టి రాజేశం, సి.వి. రమణ, ప్రేమ్‌లాల్, రాంబాబు, సట్ల కొండయ్య, భగవాన్ రెడ్డి, హేమచందు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ సింగ్, జువాజీ శ్రీనివాస్, కలవల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం

..,విద్యార్థులు సేవా మార్గంలో రాణించాలనీ ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ సూచన

బెల్లంపల్లి, మహా: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాలలో గురువారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ ఆద్వర్యంలో నిర్వహించారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 మరియు యూనిట్ 2 ల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టి విద్యార్థులతో "జాతిసేవ లో పాల్గొంటామని" ప్రతిజ్ఞ చేయించారు. ..విద్యార్థులు సేవామార్గంలో రాణించాలి... బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలోని విద్యార్థిని విద్యార్థులు అందరూ సేవా మార్గంలో రాణించాలనీ ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ విభాగం లో వాలంటీర్లుగా చేరి సేవాకార్యక్రమాల్లో భాగస్వామ్యులవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, ఎన్ఎస్ఎస్ విభాగం యూనిట్ 1,2 ప్రోగ్రాం ఆఫీసర్లు డా.ఏకాంబరం, రఫీక్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




# తుర్కయంజాల్‌లో నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే



**ఆదిభట్ల సెప్టెంబర్ 24 మహా:** గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో చివరి ఘట్టమైన నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. తుర్కయంజాల్ చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్లను అధికారులు, పోలీసులతో కలిసి ఆయన పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వచ్చే గణనాథులను ఇక్కడ నిమజ్జనం చేస్తున్నందున... ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. నీరు ఎక్కువగా ఉన్నందున ఎవరినీ లోపలికి అనుమతించవద్దని చెప్పారు. పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. చెరువుకట్టపై ట్రాఫిక్ నియంత్రణ, గణనాథుల నిమజ్జనం, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై అధికారులకు, పోలీసులకు మల్‌రెడ్డి పలుసూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ప్రశాంతంగా పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే చెప్పారు.

# బాధితకుటుంబానికిఅండగానిలుస్తాం

- నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- అమృతరాణి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం: ప్రభుత్వ విప్ విజయ రమణారావు



**పెద్దపల్లి మహా :** ఇంజనీరింగ్ విద్యార్థిని అమృతరాణిని పురుగుల మందు తాగించి దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

గురువారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామంలోని అమృతరాణి కుటుంబాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే ఠాగూర్ మక్కాన్ సింగ్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కలిసి పరామర్శించారు. మృతురాలి తల్లిదండ్రులు ఇసాక్, రజితలను ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ చదువుతున్న అమృతరాణి సింగరేణిలో ఇంటర్న్‌షిప్ చేస్తోందని తెలిపారు. ఈ నెల 13న ఇద్దరు వ్యక్తులు ఆమెకు పురుగుల మందు తాగించి దారుణంగా హత్య చేసిన ఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు. నిందితులను పోలీసులు 24 గంటల్లోనే అరెస్టు చేశారని తెలిపారు.

అమృతరాణి హత్యకు కారణమైన నిందితులకు చట్టపరంగా కఠిన శిక్ష పడేలా పటిష్టమైన చార్జిషీట్ దాఖలు చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో దళితులు, పేదలపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు.

రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి సమీక్ష నిర్వహించారని మంత్రి గుర్తు చేశారు.

**రూ.4.12 లక్షల పరిహారం**

మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి రూ.4.12 లక్షల పరిహారం అందిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మరో రూ.4.12 లక్షల పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వ విప్ విజయ రమణారావుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగం అమృతరాణి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించడంతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హామీ ఇచ్చారు.

జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు.

**మహిళలపై దాడులను ఉపేక్షించేది లేదు: మక్కాన్ సింగ్**

మహిళలపై వేధింపులకు పాల్పడే వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని రామగుండం ఎమ్మెల్యే ఠాగూర్ మక్కాన్ సింగ్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ.. సింగరేణిలో దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన సింగరేణి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుపై అనుచిత వ్యాఖ్యలు తగవు

**నస్పూర్/మంచిర్యాల, మహా :** మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుపై నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సురిమిల్లి వేణు, సుధమల్ల అశోక్ తేజ చేసిన నిరాధార వ్యాఖ్యలను పలువురు దళిత సంఘం నేతలు తీవ్రంగా ఖండించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సాధారణ కార్యకర్తగా ఉన్న సురిమిల్లి వేణును రాజకీయంగా ప్రోత్సహించడంతో పాటు, 2020 మున్సిపల్ ఎన్నికల హామీ మేరకు 2023లో మున్సిపల్ చైర్మన్ పదవి దక్కేలా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఎంతో సహకరించారన్నారు. అటువంటి నాయకుడిపై ప్రస్తుతం విమర్శలు చేయడం వారి కృతజ్ఞతాహీనతకు నిదర్శనమని మండిపడ్డారు.




రాజకీయాల్లో సైద్ధాంతిక భేదాలు, విమర్శలు సహజమే అయినప్పటికీ, ప్రజాస్వామ్య పద్ధతిలో వాటిని వ్యక్తపరచాలే తప్ప వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఇప్పటికైనా నాయకులు సంయమనం పాటించాలని, భవిష్యత్తులో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుపై అనుచిత వ్యాఖ్యలు పునరావృతమైతే దళిత, ప్రజా సంఘాల తరపున తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు దళిత సంఘాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్పొరేటర్లు కొండ్ర రాజేశ్వరీ, పుట్ట యశోద, నూకల రమేష్, ఏ రాజేష్, చిలుక మల్లేష్, నెరువెట్ల శ్రీనివాస్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.




# డిజిటల్ చెల్లింపులపై చార్జీలెందుకు?

- సామాన్యుల జేబులకు చిల్లులు పెట్టొద్దు..
- డిజిటల్ చెల్లింపులపై భారం మోపే నిర్ణయాలను కేంద్రం వెనక్కి తీసుకోవాలి
- సీపీఎం నేత జాజిరి శ్రీనివాస్ డిమాండ్

**సత్తుపల్లి, సెప్టెంబర్ 24**:మహా : సామాన్య ప్రజల రోజువారీ జీవితంలో భాగమైన యూపీఐ డిజిటల్ చెల్లింపులపై చార్జీల పేరుతో అదనపు ఆర్థిక భారం మోపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించొద్దని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రజలకు ఉచిత డిజిటల్ చెల్లింపుల సేవలను అందిస్తామని చెప్పి, భవిష్యత్తులో చార్జీల విధానాలకు అవకాశం కల్పించే నిర్ణయాలను పునఃపరిశీలించాలని కోరారు. సత్తుపల్లి ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం వేలాద్రి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**చార్జీల భారమంతా ప్రజలపైనే**

యూపీఐ చెల్లింపులు కూలీలు, రైతులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక లావాదేవీల్లో కీలకంగా మారాయని శ్రీనివాస్ తెలిపారు. డిజిటల్ చెల్లింపులపై అదనపు చార్జీలు విధిస్తే వాటి ప్రభావం వినియోగదారులు, చిన్న వ్యాపారులపై పడే అవకాశం ఉందన్నారు. వ్యాపారులు తమ లాభాలను వదులుకోరని, లావాదేవీల వ్యయం పెరిగితే వస్తువుల ధరల పెంపు ద్వారా ఆ భారాన్ని ప్రజలపైకి మళ్లించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నామని ప్రకటించే కేంద్ర ప్రభుత్వం, అదే సమయంలో చార్జీల విధానాలకు అవకాశం కల్పించడం విరుద్ధమైన చర్యగా మారుతుందని విమర్శించారు. యూపీఐ సేవలపై చార్జీల విధానానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్రజలపై భారం వద్దు..**

జీఎస్టీ ద్వారా ప్రజల నుంచి భారీగా ఆదాయం సమకూర్చుకుంటున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తోందని శ్రీనివాస్ ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు సేవా రంగాలను అప్పగించడం, వారికి ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే నిర్ణయాలు తీసుకోవడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. సామాన్య ప్రజలపై అదనపు భారాన్ని మోపే విధానాలను వ్యతిరేకిస్తూ ఐక్య ఉద్యమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, కువ్వారపు లక్ష్మణరావు, తడికమళ్ల రామకృష్ణ, కావూరి వెంకటేశ్వరరావు, ఎలగం రాములు తదితరులు పాల్గొన్నారు.



# బీటీపీఎస్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా

**మణుగూరు, మహా**: భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (బీటీపీఎస్) వద్ద గురువారం ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల పరిస్థితిని పరిశీలించేందుకు చేపట్టిన పర్యటనలో భాగంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం బీటీపీఎస్‌కు చేరుకుంది. ప్లాంట్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా జెన్కో, పోలీసు అధికారులు గేటు వద్ద వారిని అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్లాంట్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని జెన్కో విద్యుత్ కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో ఎందుకు పనిచేయడం లేదో తెలుసుకునేందుకే పర్యటిస్తున్నామని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో రాష్ట్రంలో మళ్లీ కరెంటు కోతల పరిస్థితులు నెలకొంటున్నాయని ఆయన ఆరోపించారు. రైతులు, గృహ వినియోగదారులు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ అందించేందుకు థర్మల్ ప్లాంట్లను పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ విద్యుత్ కేంద్రాలకు నాణ్యమైన బొగ్గు సరఫరా ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. బొగ్గు కొరత, సాంకేతిక సమస్యలపై విద్యుత్ శాఖ మంత్రి సమీక్షించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. బీటీపీఎస్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట కూడా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

# పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యం

- పారదర్శకంగానే ఇండ్ల ఎంపిక ప్రక్రియ
- లాటరీ ద్వారా 214 మందికి గృహాలు
- అణగారిన వర్గాలకు సముచిత ప్రాధాన్యం
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

భద్రాద్రి కొత్తగూడెం, మహా: పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 29 డివిజన్లకు, 36 మున్సిపల్ వార్డులకు చెందిన ఇండ్లు లేని నిరుపేదలకు లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించే ప్రక్రియ గురువారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాతకొత్తగూడెంలో జి2 నిర్మాణ విధానంలో 23 బ్లాకులుగా మొత్తం 828 ఇండ్లు నిర్మాణదశలో ఉన్నాయని, గతంలో కొందరిని లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక జరిగిందని గుర్తుచేశారు. మిగిలిపోయిన 214 మంది అర్హులైన పేదలను ఎలాంటి పక్షపాతం లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రజా సమక్షంలో లాటరీ తీసి కేటాయించినట్లు తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని, మొత్తం 214 ఇండ్లలో 70 ఇండ్లను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగులకు ప్రత్యేకంగా కేటాయించామని పేర్కొన్నారు. మిగిలిన 144 ఇండ్లను ఓపెన్ కేటగిరీ కింద పూర్తి నిష్పక్షపాతంగా లబ్ధిదారులకు అందజేశామన్నారు. గూడు లేని నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే బాధ్యతగా పనిచేస్తున్నామని లాటరీలో ఇండ్లు రానివారికి ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సా పాషా, మేయర్ మూడ్ గణేష్, ప్రజా ప్రతినిధులు వీరబాబు, కొత్వాల శ్రీనివాసరావు, మండే హన్మంతరావు, లలిత కుమారి, కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు పాల్గొన్నారు.




# మారెళ్లపాడు విజయవంతం.. అందరికీ ఎమ్మెల్యే పాయం కృతజ్ఞతలు

- లిఫ్ట్‌తో సాగునీటి కష్టాలకు పరిష్కారం..
- వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం..
- ఆపదలో అండగా ఎమ్మెల్యే పాయం..
- రూ.2.20 లక్షల ఎల్ఓసీతో వైద్యసాయం



**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పినపాక నియోజకవర్గ ప్రజలు, రైతులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం జరిగిన మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఆయన పేర్కొన్నారు. మంత్రుల పర్యటనతో పాటు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు చూపిన సమన్వయం, సహకారం అభినందనీయమన్నారు. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతులు, ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీటి ప్రయోజనాలు అందుతాయని, పినపాక నియోజకవర్గంలో వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

**ఆపదలో అండగా ఎమ్మెల్యే.. రూ.2.20 లక్షల ఎల్ఓసీతో వైద్యసాయం**

అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన మద్దెల అరవింద్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓసీ ద్వారా రూ.2.20 లక్షల వైద్య సహాయం అందేలా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషి చేశారు. చేతికి ఆపరేషన్ అవసరమైన అరవింద్‌కు నిజామ్స్ ఆస్పత్రిలో చికిత్సకు సుమారు రూ.2.20 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపిన నేపథ్యంలో కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. ఈ విషయాన్ని అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చెంచల రాము ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2.20 లక్షల ఎల్ఓసీ మంజూరుకు కృషి చేశారు. ఆ సహాయంతో అరవింద్‌కు అవసరమైన ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది. ఆపరేషన్ అనంతరం అరవింద్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాయం వెంకటేశ్వర్లును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి వైద్య చికిత్సకు అవసరమైన సహాయం అందేలా చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్స సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం చేస్తూ వారికి అండగా ప్రభుత్వం నిలుస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పొడిశెట్టి ఖాదర్, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిరినాకి నవీన్, నాయకులు కోడి అశోక్, భూపాలపట్నం సర్పంచ్ భవతి తదితరులు పాల్గొన్నారు.



# పట్నంలో నెరవేరనున్న మినీస్టేడియం కల...

**జోనల్‌స్థాయి పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే..**

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 24 మహా**: ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మినీస్టేడియం ఏర్పాటు దశాబ్దాల కల ఎట్టకేలకు తీరనుంది. ఈ మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్వయంగా రంగంలోకి దిగి స్థల పరిశీలన చేశారు. గురువారం ఇబ్రహీంపట్నం గురుకుల విద్యాపీట్లో నిర్వహిస్తున్న జోనల్‌స్థాయి క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి హాజరైన ఆయనకు... వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు క్రీడామైదానం అంశమై విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే... ఆర్డీవో వై శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అధికారులను అక్కడికి పిలిపించారు. కార్యక్రమం అనంతరం, గురుకుల విద్యాపీట్ పక్కనున్న సర్వేనంబర్ 320లో గల స్థలాన్ని, స్థానిక కౌన్సిలర్లతో కలిసి, ఎమ్మెల్యే పరిశీలించారు. ఆరున్నర ఎకరాలు స్టేడియంకు కేటాయింపు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆర్డీవోకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మినీస్టేడియం ఏర్పాటు చేసే బాధ్యత తనదని విద్యార్థులకు ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు




# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వలిగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి**

వలిగొండ మహా న్యూస్ : భారీ వర్షాల నేపథ్యంలో రాబోయే రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వలిగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మండల ప్రజలకు సూచించారు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటికి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు చెరువులు కాలువలు ఇతర నీటి ప్రాంతాల వద్దకు వెళ్ళవద్దని ముఖ్యంగా పిల్లలను ఆ ప్రాంతాల్లో ఆడుకోవడానికి అనుమతించవద్దని ఆయన సూచించారు వర్షాల కారణంగా రోడ్లపై చెట్లు పడటం రహదారులకు అడ్డంకులు ఏర్పడం లేదా నీటి ప్రవాహం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు చిన్నచిన్న ఆనందాల కోసం అజాగ్రత్తగా వ్యవరించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ప్రజల భద్రత పోలీసుల ప్రధాన కర్తవమని పేర్కొన్నారు

# గణేషుడికి ఎస్పీ, మున్సిపల్ చైర్ పర్సన్ పూజలు

ఆదిలాబాద్ మహా: ఆదిలాబాద్ లో గణేష్ నవరాత్రోత్సవాలు తుది అంకానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా మండపాల వద్ద ప్రముఖుల సందడి కనిపించింది. మావలా గణేష్ మండపంలో ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా దంపతులు,మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి గ్రామ పెద్దలతో కలిసి తుది పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన నిమజ్జన శోభాయాత్రలో అతిథులు గుస్సాడి వేషధారణలో అలరించారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు.



# పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగరాదు**
**బాసరలో పనులను పరిశీలించిన కలెక్టర్**
**అధికారులకు పలు ఆదేశాలు**



**నిర్మల్ మహా:** గోదావరి పుష్కరాలకు బాసరకు వచ్చే భక్తులందరికీ అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ బాసరలో పుష్కరాల పనులను సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల పార్కింగ్, వీఐపీ, వీవీఐపీ ల పార్కింగ్, హెలిప్యాడ్ నిర్మించనున్న ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల రాకపోకల సామర్థ్యానికి అనుగుణంగా పార్కింగ్ స్థలాలను ఆయా మార్గాలవారీగా ఏర్పాటు చేయాలన్నారు. ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. భక్తుల అవసరాల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. సంబంధిత అధికారులు అంతా పుష్కరాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పనులన్నీ నాణ్యవంతంగా ఉండాలని చెప్పారు.అనంతరం నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని పరిశీలించారు.ఈ పరిశీలనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఈఈ ఆర్ అండ్ బి సుభాష్, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరులో ఆటో ఫైనాన్స్ దందా..!

- ఈఎంఐ ఆలస్యమైతే ఇంటి ముందే హడావుడి..
- కుటుంబ సభ్యులపై ఒత్తిళ్లంటూ ఆరోపణలు
- అధికారులు తనిఖీలు చేపట్టాలి..
- మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు



మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు

**ణుగూరు, మహా** : ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరులో ఆటో ఫైనాన్స్ వ్యవహారాలపై సమగ్ర విచారణ చేపట్టాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు కోరారు. ఆటోల కొనుగోలు కోసం ఫైనాన్స్ తీసుకుంటున్న కొందరు వినియోగదారులు ఈఎంఐల చెల్లింపులో ఆలస్యం జరిగినప్పుడు తీవ్ర ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

**వసూళ్ల పేరుతో వేధింపులా..?**

ఒకటి, రెండు నెలల ఈఎంఐలు ఆలస్యమైనా కొందరు ఫైనాన్స్ నిర్వాహకులు రుణగ్రహీతల ఇళ్ల వద్దకు వెళ్లి హడావుడి చేస్తున్నారని, కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా మహిళలకు ఫోన్లు చేసి ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని నాగేశ్వరరావు తెలిపారు. బకాయిలను వసూలు చేసుకునేందుకు చట్టబద్ధమైన మార్గాలు ఉన్నాయని, వసూళ్ల పేరుతో కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

**అసలు అనుమతులున్నాయా..?**

మణుగూరు ప్రాంతంలో వందల సంఖ్యలో ఆటోలకు ఫైనాన్స్ చేస్తున్నట్లు చెబుతున్న వ్యాపారులు ఏ సంస్థ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు..? వారికి అవసరమైన రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు ఉన్నాయా..? బ్యాంకులు లేదా ఆర్బీఐ నియంత్రణలోని ఎన్‌బీఎఫ్‌సీల తరఫున వ్యవహరిస్తున్నారా..? లేక స్థానికంగా రుణాలు ఇచ్చే వ్యాపారం నిర్వహిస్తున్నారా..? అనే విషయాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

**వడ్డీ ఎంత..? చార్జీల లెక్కేంటి..?**

ఆటో కొనుగోలుకు ఫైనాన్స్ ఇచ్చే సమయంలో రుణ మొత్తం, వడ్డీ రేటు, నెలవారీ ఈఎంఐ, ప్రాసెసింగ్ ఫీజు, ఆలస్య రుసుములు తదితర నిబంధనలను రుణగ్రహీతలకు స్పష్టంగా తెలియజేస్తున్నారా..? రాతపూర్వక ఒప్పందాలు, రసీదులు అందిస్తున్నారా..? అనే అంశాలను కూడా అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. రుణం తీసుకునే సమయంలో ఒక విధంగా చెప్పి, తర్వాత మరో విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపైనా విచారణ జరగాలని కోరారు.

**అధికారుల తనిఖీలు చేపట్టాలి**

మణుగూరులో ఆటో ఫైనాన్స్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు, వ్యక్తుల వివరాలను సంబంధిత శాఖలు పరిశీలించాలని నాగేశ్వరరావు కోరారు. వారి రిజిస్ట్రేషన్, లైసెన్సులు, రుణ ఒప్పందాలు, వడ్డీ రేట్లు, అదనపు చార్జీలు, వసూళ్ల విధానం తదితర అంశాలపై తనిఖీలు నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. చట్టబద్ధమైన అనుమతులతో వ్యాపారం చేస్తున్నవారెవరు..? అనధికారికంగా రుణాలు ఇస్తూ నిబంధనలకు విరుద్ధంగా వడ్డీలు లేదా ఇతర చార్జీలు వసూలు చేస్తున్నవారెవరైనా ఉన్నారా..? అనే విషయాన్ని తేల్చాలని కోరారు. ముఖ్యంగా రుణగ్రహీతల కుటుంబ సభ్యులు, మహిళలు, స్నేహితులకు ఫోన్లు చేసి ఒత్తిడి చేస్తున్నారనే ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఆటో నడుపుకొని కుటుంబాలను పోషించుకునే సామాన్యులను ఫైనాన్స్ వసూళ్ల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదులను అధికారులు తేలిగ్గా తీసుకోకూడదు. మణుగూరులో ఆటో ఫైనాన్స్ కార్యకలాపాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు కోరారు.

# పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నాం...

- దూరదృష్టితో ఫ్యూచర్‌సిటీలో స్పోర్ట్స్ స్కిల్ యూనివర్సిటీ..
- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 24 మహా: పిల్లల భవిష్యత్‌కు బంగారుబాటలు వేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం విద్యార్థుల భవిత కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సాహం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' జోనల్ స్థాయి పోటీలు ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీట్ వేదికగా ఆయన ప్రారంభించారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు... వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పరేడ్ మార్చ్‌తో ఘనస్వాగతం పలికారు. పిల్లల గౌరవవందనం స్వీకరించిన మల్‌రెడ్డి..., జెండా ఊపి, క్రీడల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన మల్‌రెడ్డి రంగారెడ్డి... సమాజమార్పు విద్యతోనే సాధ్యమని చెప్పారు. ఇందుకోసమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మారుమూల ప్రాంతం, అట్టడుగు వర్గాలకు సైతం నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్యనందించేందుకు దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఫ్యూచర్‌సిటీలో స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో విద్యావిప్లవానికి ఆరుట్ల నుంచే శ్రీకారం చుట్టడం జరిగిందని చెప్పిన మల్‌రెడ్డి... తల్లిదండ్రుల కలల్ని పిల్లలు సాకారం చేస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల పలు విజ్ఞాపనలను స్వీకరించిన ఎమ్మెల్యే... స్పోర్ట్స్ యూనిఫాం, ఇతర సౌకర్యాల కల్పనకు హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏఎంసి చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, ఎంఈఓ హిర్యా నాయక్, గురుకుల విద్యాపీట్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు దారు రాఘవేందర్, వర్త్య రాందాస్ నాయక్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ పాషా, మండల పార్టీ అధ్యక్షులు రావణమోని లింగం ముదిరాజ్, ఏఎంసి డైరెక్టర్ దొంతరమోని రాజు, తాళ్ల మహేష్ గౌడ్, సుబ్బురు మల్లికాపాండు, కర్ణంగూడ సర్పంచ్ తిరుమలరెడ్డి, పలువురు అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ కార్యాలయంలో లంబోదరునికి దర్శించుకున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** బిజెపి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు బోక్క నరసింహారెడ్డి తో కలిసి కాటేదాన్ బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసినవినాయకుని గురువారం సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బిజెపి నేతలు మాట్లాడుతూ విఘ్నాలు తొలగించి ప్రజలందరికీ, ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, సౌభాగ్యం కలగాలని స్వామివారిని వేడుకున్నమని తెలిపారు. సనాయి వాయిద్యాలతో వినాయకుని విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి కొలనులో వినాయకుని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాలపై బల్దియా అప్రమత్తం

వరంగల్, కార్పొరేషన్ మహా: రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అప్రమత్తమైంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ తదితర విభాగాల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాల పరిస్థితిపై సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలు, నీటిముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు జేసీబీలు, డీవాటరింగ్ మోటార్లు, ట్రాక్టర్లు, ఇతర యంత్రాలు, పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చెట్లు విరిగిపడటం, రహదారులపై నీరు నిలవడం, నాలాలు పొంగిపొర్లడం వంటి ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. పరిస్థితులు తీవ్రతరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులు, అత్యవసర సమాచారాన్ని స్వీకరించేందుకు బల్దియా ప్రధాన కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. టోల్‌ఫ్రీ 1800 425 1980, కంట్రోల్ రూమ్ 9701999645, వాట్సాప్ 9701999676 నంబర్లకు ప్రజలు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రెస్క్యూ, డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

## 100 మంది లబ్ధిదారులకు ఎగ్ కార్డుల పంపిణీ

**వర్ధన్నపేట,మహా ;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఎన్ఈసిసి ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గంలోని వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాలకు చెందిన సుమారు 100 మంది లబ్ధిదారులకు ఎగ్ కార్డులను పంపిణీ చేశారు. శ్రీ సత్యనారాయణ స్వామి కోళ్ల ఫామ్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు , మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ , ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు , యువ నాయకులు ఆరూరి విశాల్ పాల్గొని లబ్ధిదారులకు ఎగ్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడిగుడ్డులో నాణ్యమైన ప్రోటీన్‌తో పాటు శరీరానికి అవసరమైన పలు విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు లభిస్తాయని తెలిపారు. పిల్లల ఎదుగుదలకు, శరీర కండరాల అభివృద్ధికి, శక్తిని అందించడానికి కోడిగుడ్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అందుబాటులో ఉండే ధరలో అధిక పోషక విలువలు అందించే ఆహారంగా కోడి గుడ్డును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఈసిసి జనరల్ మేనేజర్ డాక్టర్ ఎజిల్ కుమార్ గారు, రాజీవ్, కోళ్ల రైతులు సుబ్రహ్మణ్యం, దిలీప్ రావు స్థానిక నాయకులు, పౌల్ట్రీ రైతులు, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 24/7 అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- గూగుల్ మీట్ ద్వారా జిల్లా యంత్రాంగంతో కలెక్టర్ సమావేశం



**హనుమకొండ, మహా ;** జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి, జిల్లాలో వర్ష ప్రభావం, ప్రస్తుత పరిస్థితులు, గురు, శుక్రవారాలు వర్షాలకు హై అలెర్ట్ ఉన్న నేపథ్యంలో అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. మండలాల వారీగా వర్షపాతం, చెరువుల పరిస్థితి, వాగులు, వంకలు, రహదారుల పరిస్థితి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో వర్షాల సమయంలో సమస్యలు ఎదురైన ప్రాంతాల వివరాలను తెలుసుకుని, ఆయా ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టడంపై అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలను జారీ చేశారు. *ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలోని వేలేరు , ఆత్మకూర్ మండలాల్లో బుధవారం కురిసిన వర్షంతో అధిక వర్షపాతం నమోదైందన్నారు. గురువారం, శుక్రవారం కూడా ఆకస్మికంగా భారీ వర్షపాతం నమోదైతే వాగులు, వంకలు పొంగిపొర్లి రహదారులపైకి వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలను అధికారులు చేపట్టాలన్నారు. చెరువులు, వాగులు, వంకల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వరద నీరు రహదారులపైకి వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేర నీరు ఉందో సాగునీటి పారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపాతం పెరిగినప్పుడు చెరువుల నీటిమట్టం, నీటి ప్రవాహ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. భారీ వర్షాల సమయంలో అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండాలని, ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే క్షేత్రస్థాయిలో స్పందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గతంలో వర్షాల సమయంలో ఇబ్బందులు ఎదురైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రస్తుతం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను పరిశీలించాలని ఆదేశించారు.

**మున్సిపల్ అధికారులకు సూచనలు**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నాలాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తను వెంటనే తొలగించాలన్నారు. ప్రధాన నాలాల వద్ద వరద నీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అలాగే అన్నీ మండలాల్లో అవసరమైన ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా సమస్య వచ్చినట్లయితే వెంటనే సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో.. కంట్రోల్ రూమ్‌లో అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారం పై వెంటనే స్పందించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా వర్షాల కారణంగా జరిగిన నష్టం పై వెంటనే వివరాల నివేదికను అంద జేయాలన్నారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎడతెరపి లేకుండా వర్షం కురిసినప్పుడు అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ గూగుల్ మీట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్ వెంకన్న, జడ్పీ సీఈఓ శేషాద్రి, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, సాగునీటి పారుదల శాఖ ఈఈ మంగీలాల్, రోడ్లు,భవనాలు శాఖ ఈఈ దేవిక చౌహాన్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పెరటి కోళ్ల పెంపకంపై మూడు రోజుల శిక్షణ

**రాజేంద్రనగర్, మహా:** పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ రైతు శిక్షణ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పెరటి కోళ్ల పెంపకంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ ఎంపిక చేసిన సుమారు 30 మంది ఎస్సీ, ఎస్టీ మహిళా యువ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు శిక్షణ అందించారు. ముగింపు కార్యక్రమానికి హాజరైన విస్తరణ విభాగ సంచాలకులు డాక్టర్ ఎం. కిషన్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ యువత, మహిళలకు పెరటి కోళ్ల పెంపకం చక్కటి ఆదాయ వనరుగా ఉపయోగపడుతుందని తెలిపారు. శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం పొందడంతో పాటు కుటుంబానికి ఆర్థిక భరోసా, పోషకాహార భద్రత లభిస్తాయని పేర్కొన్నారు. పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి. మాధురి మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు గ్రామీణ మహిళల్లో నైపుణ్యాలను పెంపొందించి స్వయం సమృద్ధి సాధించేందుకు దోహదపడతాయని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కోళ్ల విభాగ శాస్త్రవేత్తలు డాక్టర్ దైద కృష్ణ, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనిల్ పవన్, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ శ్రీలత, శిక్షణ కేంద్రం అధికారిణి డాక్టర్ పి. అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీఎం పై రాజకీయాలు మానుకోండి

- పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు?
- వరంగల్ డిసిసి అధ్యక్షుడు అయూబ్




**వరంగల్, బ్యూరో మహా ;** వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ హ ఎంజీఎం ఆస్పత్రి పై మొసలి కన్నీరు కారుస్తూన్న బీఆర్ఎస్ నేతల పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...అధికారం పోయిన తర్వాత పగటి వేషగాళ్ల మాదిరిగా బీఆర్ఎస్ నేతలు ఎంజీఎం ఆస్పత్రిపై చేస్తున్న హడావుడి ప్రజలకు నవ్వు తెప్పిస్తోంది. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎంజీఎం ఆస్పత్రి గురించి పట్టించుకోని నాయకులకు ఇప్పుడు అకస్మాత్తుగా ఎంజీఎం పై ప్రేమ పుట్టుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంజీఎం ఆస్పత్రిలో కనీస వసతులు కల్పించేందుకు కూడా సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని అయూబ్ విమర్శించారు. ఎక్స్‌రే లాంటి కనీస సదుపాయాలను కూడా సక్రమంగా అందుబాటులోకి తీసుకురాలేని పరిస్థితి మీ హయాంలో ఉంటే.. ఇప్పుడు ఎంజీఎం గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు ఎక్కడిది? అని ప్రశ్నించారు.నూతన ఆస్పత్రి నిర్మాణం పేరుతో హడావుడి చేయడం తప్ప, దాన్ని పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యం కంటే రాజకీయ స్వలాభమే ముఖ్యమా? ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి వదిలేయడం మీ పాలనలో సాధారణంగా మారిపోయింది మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఎంజీఎం ఆస్పత్రిలో మౌలిక వసతులు, వైద్య సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని అయూబ్ తెలిపారు.సిఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇప్పటికే పలుమార్లు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పురోగతిని మరియు ఎంజీఎం ఆస్పత్రిపై సమీక్షలు నిర్వహించి, సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని ఎంజీఎం ఇప్పుడు ప్రతిరోజూ ఎందుకు గుర్తుకొస్తోంది? ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఎంజీఎం ఘటనను రాజకీయ అంశంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని అయూబ్ విమర్శించారు. పోలీసులు తన పై దాడి చేశారన్న ఆరోపణలపై పూర్తి వాస్తవాలు విచారణలో తేలాల్సి ఉందని, అయితే ఘటనకు సంబంధించిన పూర్తి దృశ్యాలు, ఆధారాలు ప్రజల ముందుంచకుండా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. పోలీసులు కొట్టారని చెబుతున్నారు. అయితే ఆ ఆరోపణకు సంబంధించిన పూర్తి ఆధారాలు ఎక్కడున్నాయి? ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. ఎంజీఎం ఆస్పత్రిలో జరిగిన ఘటనను కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులను పోలీసులు అనుమతించక పోవడంపై జిల్లా అధ్యక్షుడు అయూబ్ స్పందిస్తూ మీడియా ప్రజలకు వాస్తవాలను తెలియజేసే వారధి ఆస్పత్రిలో ఏం జరుగుతుందో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది ఇలాంటి సందర్భాల్లో పారదర్శకత ఉండాలని అన్నారు. పార్టీ అధినేత ను ఫామ్‌హౌస్‌లో కూర్చోబెట్టి రాజకీయాలు చేయడం ఎందుకు? ఆయనను అసెంబ్లీకి పంపించి ఎంజీఎం సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం వినియోగించుకోవాలి కదా? అని సూటిగా ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రెస్‌మీట్లలో ఆరోపణలు చేయడం కాకుండా చట్టసభల్లో ప్రశ్నించాలని సూచించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనను కూడా ప్రజలు చూశారు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పనులను కూడా ప్రజలు చూస్తున్నారని చివరగా, ఎంజీఎం ఆస్పత్రి సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి వరంగల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ కమలుద్దీన్, 3వ డివిజన్ అధ్యక్షుడు జన్ను అరుణకర్,14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, 43వ డివిజన్ అధ్యక్షుడు మాడుగుల రాజుకుమార్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువుకు పునర్జన్మ

**పెద్దపల్లి, మహా:** ఎనిమిదో నెలలో 1.5 కిలోల బరువుతో జన్మించి, తీవ్ర శ్వాస సమస్యలతో ఇబ్బందిపడుతున్న పసిబిడ్డకు పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి వైద్యులు 21 రోజుల పాటు ప్రత్యేక చికిత్స అందించి ఆరోగ్యవంతంగా ఇంటికి పంపించారు. ముందస్తు ప్రసవం కావడంతో పుట్టిన వెంటనే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవడంతో శిశువును జిల్లా ఆసుపత్రిలోని నవజాత శిశు సంరక్షణ విభాగానికి తరలించారు. వైద్యులు నాలుగు రోజుల పాటు సీపాప్ ద్వారా శ్వాస సహాయం అందించారు. అనంతరం నాసల్ ప్రాంగ్స్ ద్వారా ఆక్సిజన్ అందిస్తూ చికిత్స కొనసాగించారు. శిశువు బరువు పెరిగేందుకు కంగారూ మదర్ కేర్‌తో పాటు తల్లిపాలను అందించారు. తక్కువ బరువు కారణంగా తలెత్తిన ఇన్ఫెక్షన్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలకు కూడా వైద్యులు చికిత్స అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేక పర్యవేక్షణలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నిరంతరం శిశువు ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. 21 రోజుల అనంతరం శిశువు పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు. వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ అభినందించారు. ఆసుపత్రిలో ఇప్పటివరకు సుమారు 1,100 మంది నవజాత శిశువులకు చికిత్స అందించినట్లు తెలిపారు.

## చేయూత పింఛన్ దరఖాస్తులపై విచారణ

**అర్హులకే సంక్షేమ పథకాలు : ఎంపీడీవో**

**కారేపల్లి, మహ :** చేయూత పింఛన్ల దరఖాస్తుల విచారణ ప్రక్రియను అధికారులు చేపట్టారు. పింఛన్ల కోసం చేసుకున్న దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి అధికారులు విచారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో పింఛన్లకు సంబంధించిన వివరాలను గురువారం క్షేత్రస్థాయిలోఎంపీడీవో బి.పద్మ పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్‌కు సంబంధించిన ధ్రువీకరణ ప్రక్రియను చేపట్టి, అర్హతకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందేలా వెరిఫికేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హుల గుర్తింపులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా క్షేత్రస్థాయిలో వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.



## నిమజ్జనం పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- గణేశ్ నిమజ్జన ప్రక్రియను పరిశీలించిన వరంగల్ సీపి, జిడబ్ల్యుఎంసి కమిషనర్

**వరంగల్, పోచమ్మ మైదాన్ మహా:** వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద కొనసాగుతున్న గణేశ్ నిమజ్జన ప్రక్రియను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన ప్రక్రియ కొనసాగుతున్న తీరు, భక్తుల రాకపోకలు, భద్రత, పారిశుద్ధ్య ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఇప్పటివరకు నిమజ్జనం పూర్తయిన గణేశ్ విగ్రహాల సంఖ్య, ఇంకా నిమజ్జనం చేయాల్సిన విగ్రహాల వివరాలను సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షం కురుస్తున్న నేపథ్యంలో గణేశ్ విగ్రహాలను సాధ్యమైనంత త్వరగా నిమజ్జన కేంద్రాలకు తీసుకువచ్చి నిమజ్జనం పూర్తిచేసుకునేలా ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు సూచించాలని అధికారులను ఆదేశించారు.వర్షం కారణంగా భక్తులు, నిర్వాహకులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సీపీ శ్వేత, కమిషనర్ వెంకన్న సూచించారు. పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. అదేవిధంగా నిమజ్జనం పూర్తైన వెంటనే విగ్రహాల అవశేషాలు, ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని కమిషనర్ వెంకన్న ఆదేశించారు. ఈ పరిశీలనలో బల్దియా సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## యూజీడీ భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్, బల్దియా ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, మహా; గ్రేటర్ వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కి (యూజీడీ) సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో యూజీడీ కి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పురోగతిపై రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీలు), సీవరేజ్ పంపింగ్ స్టేషన్లు, లిఫ్టింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ అంశాలను కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో మొత్తం 23 ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భూములకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పురోగతిపై అధికారులను కలెక్టర్ అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... భూసేకరణకు సంబంధించిన ప్రక్రియను అధికారులు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. యూజీడీ పనుల అమలుకు భూసేకరణలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, తహసీల్దార్లు, భూ సేకరణ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## 100 మంది లబ్ధిదారులకు ఎగ్ కార్డుల పంపిణీ



**వర్ధన్నపేట,మహా ;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఎన్ఈసిసి ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గంలోని వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాలకు చెందిన సుమారు 100 మంది లబ్ధిదారులకు ఎగ్ కార్డులను పంపిణీ చేశారు. శ్రీ సత్యనారాయణ స్వామి కోళ్ల ఫామ్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు , మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ , ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు , యువ నాయకులు ఆరూరి విశాల్ పాల్గొని లబ్ధిదారులకు ఎగ్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడిగుడ్డులో నాణ్యమైన ప్రోటీన్‌తో పాటు శరీరానికి అవసరమైన పలు విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు లభిస్తాయని తెలిపారు. పిల్లల ఎదుగుదలకు, శరీర కండరాల అభివృద్ధికి, శక్తిని అందించడానికి కోడిగుడ్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అందుబాటులో ఉండే ధరలో అధిక పోషక విలువలు అందించే ఆహారంగా కోడి గుడ్డును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఈసిసి జనరల్ మేనేజర్ డాక్టర్ ఎజిల్ కుమార్ గారు, రాజీవ్, కోళ్ల రైతులు సుబ్రహ్మణ్యం, దిలీప్ రావు స్థానిక నాయకులు, పౌల్ట్రీ రైతులు, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 26న గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

**5 నుంచి 9వ తరగతి వరకు, ఇంటర్‌లో ఖాళీ సీట్ల భర్తీ**

**కారేపల్లి, మహ :** సింగరేణి మండలం గాంధీపురం గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 26న స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు గురుకుల ప్రిన్సిపాల్ జి. హరికృష్ణ తెలిపారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురుకులాల ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలిపారు. 5వ తరగతిలో 5, 7వ తరగతిలో 4, 8వ తరగతిలో 2, 9వ తరగతిలో 3 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 26న గురుకులంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్ ప్రక్రియకు హాజరు కావాలని కోరారు.



# బెల్లంపల్లిలో కామ్రేడ్ పోశెట్టి నివాళి గీతం ఆవిష్కరణ

**బెల్లంపల్లి,మహా:** ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట వీరుడు కామ్రేడ్ పోతుగంటి పోశెట్టి నివాళి గీతాన్ని గురువారం స్థానిక సీపీఐ పట్టణ ఆఫీస్ లో ఆయన కుమారుడు పోతుగంటి అశోక్, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి, సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి లతో కలిసి ఆవిష్కరించారు.పోశెట్టి 45వ వర్ధంతి సందర్భంగా తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ, బెల్లంపల్లిలో కమ్యూనిస్టు పార్టీకి బలమైన పునాది వేయడంలో పోశెట్టి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పార్టీని బెల్లంపల్లికి తీసుకురావడంతో పాటు నాయకులను తీర్చిదిద్ది, కార్యకర్తలను సమీకరించి పార్టీని బలోపేతం చేశారని తెలిపారు. ఆయన నాయకత్వంలో బెల్లంపల్లిలో సీపీఐ కంచుకోటగా ఎదిగిందన్నారు. ఆసిఫాబాద్ సమితికి మూడుసార్లు ఉపాధ్యక్షుడిగా, ఒకసారి అధ్యక్షుడిగా, చాకేపల్లికి వరుసగా నాలుగు సార్లు ఏకగ్రీవ సర్పంచ్ గా కూడా ప్రజలకు సేవలందించి ప్రజల మనిషిగా వారి గుండెల్లో నిలిచిపోయారని గుర్తుచేశారు. పోశెట్టి పోరాట జీవితం, ప్రజా సేవ, కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన చేసిన కృషిని భావితరాలకు పరిచయం చేసే ఉద్దేశంతో నివాళి గీతాన్ని రూపొందించినట్లు గీత రచయిత, పోశెట్టి మనవడు పోతుగంటి భరత్ రుషి తెలిపారు. పోరాట యోధుడిగా ఆయన ప్రదర్శించిన స్ఫూర్తి, ప్రజా నాయకుడిగా అందించిన సేవలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, తాండూరు మండల కార్యదర్శి కొండు బానేష్, జిల్లా సమితి సభ్యుడు గుండా చంద్రమాణిక్యం, బీకేఎంయూ జాతీయ సమితి సభ్యుడు అక్కేపల్లి బాపు, ఎస్సీడబ్ల్యూ యు బెల్లంపల్లి అసిస్టెంట్ సెక్రటరీ దాసరి తిరుపతిగౌడ్, ప్రజా నాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు బొంకూరి రామచందర్, నాయకులు స్వామి దాస్, ఇనుముల రాయమల్లు తదితరులు పాల్గొన్నారు




# తెలంగాణ లో టిఆర్పి అధికారంలోకి రావడం తథ్యం

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మహేశ్ వర్మ**

**బెల్లంపల్లి , మహా:** తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ , ప్రధాన కార్యదర్శి రామటానికి శ్రీనివాస్ లు సంయుక్తంగా ప్రకటించారు. గురువారం రోజు బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పార్టీ శ్రేణులతో కలిసి నియోజకవర్గంలోని పలు మండలాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అగ్రవర్ణాలైనా రెడ్లు, వెలమల ఆధిపత్యం నేటికీ కొనసాగుతుందని రాష్ట్రంలో అత్యల్ప జనాభా కలిగిన అగ్రవర్ణాలు నేటికీ వివిధ రాజకీయ పార్టీల లో ఉండి అత్యున్నత పదవులను చేపట్టడం, అత్యధిక జనాభా కలిగిన బీసీలకు తీరని అన్యాయం చేయడం నేటికీ కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా బెల్లంపల్లి నియోజకవర్గం లోనూ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో అత్యధిక జనాభా గలిగిన బీసీలకు వివిధ రాజకీయ పక్షాలు పదవులను కట్టబెట్టడంలో తీరని అన్యాయం చేస్తున్నాయని తద్వారా బీసీలకు, ఎస్సీలకు ,ఎస్టీలకు ప్రజాస్వామ్య ఫలాలు అందడం లేదని పేర్కొన్నారు. బెల్లంపల్లి లో గెలిచిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ సైతం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడం లేదని, ఆయన వైఖరిపై సంబంధిత స్థానిక కాంగ్రెస్ పార్టీలోని నాయకులే బహిరంగంగా విమర్శించడం ఆయన చేసే ప్రజాసేవకు నిదర్శనమని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గం లోని పలు మండలాల్లో అగ్రవర్ణాలకు చెందిన నాయకులే ఆధిపత్యాన్ని వహిస్తూ ఉండడం నేటికీ కొనసాగుతుందని ,తమ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు ప్రాధాన్యతను, సముచిత స్థానాన్ని కల్పిస్తూ, ప్రజాస్వామ్య ఫలాలు, పదవులను కేటాయిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో తాండూరు మండలాధ్యక్షుడు అనిల్ ,నెన్నల మండల అధ్యక్షుడు మహేష్ సోషల్ మీడియా ఇన్చార్జి లతీఫ్, నాయకులు నరేష్ ,వంశీ, బానేష్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంత సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- **మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**
- **కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో అటవీ, గిరిజన శాఖలు, ఎన్జీవోల రెండు రోజుల సదస్సు**



**మంచిర్యాల, మహా:** జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ కేంద్రంగా అటవీ, గిరిజన సంక్షేమ శాఖలు, స్వచ్ఛంద సంస్థల (ఎన్జీవో) ప్రతినిధుల మధ్య రెండు రోజులపాటు ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం గురువారంతో ముగిసింది. జిల్లా కేంద్రంలోని ధరణి ఫంక్షన్ హాల్‌లో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్ శాంతారామ్, ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల అటవీ అధికారులు రాహుల్ కిషన్ జాదవ్, బాలమణి, సుశాంత్ సుఖదేవ్‌లతో కలిసి కలెక్టర్ ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతాలలో నివసించే ఆదివాసి గిరిజన ప్రజల జీవనం, సంక్షేమం కోసం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. అటవీ ఉత్పత్తుల విక్రయం ద్వారా గిరిజనులకు తగిన ఆదాయం సమకూరేలా చూడాలని, కనీస మౌలిక వసతులు కల్పించాలని ఆయన వివరించారు. జాతీయ వన్యప్రాణుల ఉద్యానవనాలు, అభయారణ్యాలు, నిషేధిత అటవీ ప్రాంతాలలో నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, అటవీ ఆక్రమణలకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే అటవీశాఖ అధికారులదే పూర్తి బాధ్యత ఉంటుందని తేల్చి చెప్పారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా జిల్లాలోని అటవీ ప్రాంతాలలో జంగల్ సఫారీ ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. మొదటి రోజు సెప్టెంబర్ 23న అధికారులు, ఎన్జీవో ప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిస్థితులు, గిరిజన గ్రామాలు, వన్యప్రాణుల ఆవాసాలను పరిశీలించారు. రెండో రోజు ఈ అనుభవాలపై చర్చించి, గిరిజనుల అటవీ హక్కుల చట్టం అమలు, జీవనోపాధికి భరోసా కల్పించడంపై సమీక్షించారు.అటవీ సంరక్షణ, వన్యప్రాణుల రక్షణలో స్థానిక గిరిజనులను భాగస్వామ్యం చేస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడుకునేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అటవీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, కవ్వాల్ టైగర్ రిజర్వ్ సిబ్బంది, ఎన్జీవో ప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆధునిక వసతులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

- **ప్రపంచ ప్రమాణాలకు.. అనుగుణంగా విద్యాబోధన**
- **గబ్బిలాల పేటలో నూతన పాఠశాల కోసం స్థల పరిశీలన**
- **జిల్లా కలెక్టర్ మను చౌదరి**



**జవహర్ నగర్, మహా:** ఆధునిక వసతులతో గబ్బిలాల పేటలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధన నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ మను చౌదరి వెల్లడించారు. జవహర్ నగర్ లోని గబ్బిలాలపేటలోని అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించేందుకుగాను స్థలాన్ని కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతమంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. స్కూల్లోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఆధార్ కార్డు లేని పిల్లలకు ఆధార్ క్యాంపు నిర్వహించి ఆధార్ కార్డును అందించాలని కాప్రా తహసిల్దార్ మతిన్ ను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం నూతన భవనాన్ని నిర్మించేందుకు స్థల సేకరణ నిమిత్తం స్థల వివరాలను తహసిల్దారును అడిగి తెలుసుకున్నారు. గబ్బిలాల పేటలోని సర్వే నెంబర్లు 285, 299 300, 185 లలో అందుబాటులో ఉన్న స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సర్వే నెంబర్లలో ఏమైనా భూ సమస్యలు కోర్టు కేసులు ఉన్నాయా? అనే వివరాలను తనకు నివేదిక పంపాలని తాసిల్దార్ కు సూచించారు. ఈ మేరకు స్థానికులు సర్వే నెంబర్ 300 లేదా సర్వే నెంబరు 185 సర్వే నెంబర్లలో నిర్మిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని కోరగా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖ వారు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించడానికి ముందుగానే అనుమతించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, కాప్రా మండల తాసిల్దార్ మతిన్, ఆర్ఐ సత్యనారాయణ, కాప్రా మండల అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లి పట్టణానికి గుడ్ బై చెప్పిన బడా గణేష్

- **నిమజ్జనానికే తరలిన వరసిద్ధి వినాయక మండప నిర్వాహక మినీ ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహం**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలో వరసిద్ధి వినాయక మండప నిర్వాహక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహం గురువారం నాడు నిమజ్జనాని సంసిద్ధమై తరలింది. మండప నిర్వాహకులు బెల్లంపల్లి పట్టణంలో 20 ఫీట్లకు పైగా ఏర్పాటు చేసిన విగ్రహం భక్తులను ,చూపరులను విశేషంగా ఆకట్టుకుంది నిమజ్జనానిక తరులుతున్న బడా గణేష్ దర్శించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు, పట్టణవాసులు వీడ్కోలు పలికేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు .ఉత్సవ కమిటీ ఈ సందర్భంగా ఆదివాసి సంస్కృతి ప్రతిబింబించేలా గిరిజన సాంప్రదాయక నృత్యమైన గుస్సాడీ తోపాటు మహారాష్ట్ర కు చెందిన వాయిద్య కళాకారులు తమ నృత్య ప్రదర్శనలు ఆటపాటలతో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడికి ఘనంగా వీడుకోలు పలికారు. విగ్రహం తరులుతున్న క్రమంలో ట్రాఫిక్కు ఇబ్బంది కలగకుండా బెల్లంపల్లి వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షించారు.



# చెన్నూర్ నియోజకవర్గంలో విద్యారంగానికి పెద్దపీట

**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

**జైపూర్/ మంచిర్యాల :** జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి తెలంగాణ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేకానంద అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలో షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఇతర అధికారులతో కలిసి ఆయన భూమిపూజ చేసి శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థుల సంక్షేమం కోసం 1 కోటి 81 లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధులతో ఈ వసతి గృహాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2 కోట్ల రూపాయలతో జూనియర్ కళాశాలలో 1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన వెల్లడించారు. మండలంలోని సోమనపల్లిలో 200 కోట్లతో ఏకకాలంలో 2,500 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల' నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. చెన్నూర్ ప్రాంతంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు, కోటపల్లి మండలంలో ఎస్సీ వసతి గృహ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో జర్మనీ భాష శిక్షణనిచ్చి విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పనకు కృషి చేస్తున్నామని వివరించారు. చెన్నూర్ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రామకృష్ణాపూర్ ప్రాంత ప్రజల సౌలభ్యం కోసం మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు ప్రతిపాదనలు చురుగ్గా జరుగుతున్నాయని అన్నారు. మందమర్రి ప్రాంతంలో సింగరేణి సమన్వయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం. వచ్చే గోదావరి పుష్కరాల కోసం 70 కోట్ల రూపాయలతో పుష్కర ఘాట్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు జైపూర్ కేజీబీవీ పాఠశాలను మంత్రి, కలెక్టర్ సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజనం, విద్యాబోధనను పరిశీలించారు. విద్యార్థినులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఎ.భాస్కర్, ఎస్సీ అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, తహసిల్దార్ వనజా రెడ్డి, ఎంపీడీఓ శ్రీపతి బాపు, డిసిసి ప్రతినిధి రఘునాథ్, చెన్నూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తివారి తదితరులు పాల్గొన్నారు.



# చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారం

- **కాలుష్య కాటుకు జలవనరు.**
- **పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు ?**

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: మండలంలోని శ్రీరాంపూర్ చెరువు పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయి అధ్వానంగా మారాయి. చెరువులోకి ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు, ఆహార పొట్లాలు, ఇతర వ్యర్థాలను విచ్చలవిడిగా పడేయడంతో నీరు కలుషితమవుతోంది. చెరువు నీటిలో పెద్దఎత్తున చెత్త తేలుతూ కనిపిస్తుండగా, ఒడ్డున కూడా వ్యర్థాలు పేరుకుపోయాయి. చెరువు పరిసరాల్లో పిచ్చిమొక్కలు, పిచ్చిగడ్డి విపరీతంగా పెరగడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల సమయంలో చెత్త నీటిలో కలవడంతో నీటి నాణ్యత మరింత దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి చెరువును శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టి చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**చెరువులోకి డ్రైనేజీ నీరు..**

**ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**

చెరువులోకి డ్రైనేజీ నీరు చేరుతుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీరు చెరువులో కలవడం వల్ల నీటి కాలుష్యంతో పాటు దుర్వాసన, దోమల బెడద పెరిగి ప్రజలు అవస్థలు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు డ్రైనేజీ నీటిని చెరువు వైపు మళ్లించకుండా ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించేలా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పాలకుర్తి రైతు వేదికలో మండల ప్రజా పరిషత్ సమావేశం

**పాలకుర్తి, 24 మహా** సెప్టెంబర్ రామగుండం నియోజకవర్గం పాలకుర్తి గ్రామంలోని రైతు వేదికలో మండల ప్రజా పరిషత్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, సామర్థ్య పెంపుదల తదితర అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. ఈ సమావేశానికి రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ హాజరయ్యారు. మండలంలోని వివిధ అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సునీత, ఎంపీడీవో రమేష్, సీఐ కృష్ణ, ఎంపీవో సుదర్శన్, ఏపీవో కొమురయ్య, మండల అధికారులు, పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల, పాలకుర్తి మండల సర్పంచులు ఫోరం అధ్యక్షులు పరిచవేని శ్రీనివాస్ యాదవ్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్ , పాలకుర్తి మండల సర్పంచులు , మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు...

**మహా కథనానికి స్పందించిన విద్యుత్ అధికారి ఏఈ, షేక్ బాషా.**

**రాజేంద్రనగర్ మహా ;** యదేచ్ఛగా విద్యుత్ చౌర్యం మహా కథనానికి స్పందించిన శంషాబాద్ విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ బాషా పెద్ద గోల్కొండ రెవెన్యూ పరిధిలోని మంత్ర ఫంక్షనల్ సమీపంలో ట్రాన్స్ ఫార్మర్ నుండి నేరుగా కోండీలు వేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఘటన స్థలానికి పరిశీలించి నేరుగా వేసిన కోండీలను, నేలకు ఒరిగిన స్తంభాన్ని వైర్లును తొలగించారు, అదే స్థలంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. సబ్ మీటర్ లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలతో పాటు జరిమానా తప్పదని హెచ్చరించారు.



# జిల్లాస్థాయి అథ్లెటిక్స్ లో విద్యార్థులు రాణించడం అభినందనీయం

**సిఆర్పిఎఫ్ స్కూల్ ప్రిన్సిపల్ డి. అపర్ణ.**

**జవహర్ నగర్, మహా :** జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిఆర్పిఎఫ్ విద్యార్థులు రాణించడం అభినందనీయమని, చదువుతోపాటు క్రీడల్లో బాలబాలికలు నైపుణ్యం సాధించాలని ప్రిన్సిపాల్ డి. అపర్ణ పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు చంద్రపురి కాలనీ డివిజన్ అరుంధతి నగర్ సిఆర్పిఎఫ్ క్యాంపస్ ఆవరణలో గురువారం ప్రిన్సిపాల్ అపర్ణ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుండే మంచి భవిష్యత్తును ఎంచుకొని ముందుకు సాగాలని ఆధునిక కాలంలో ఫోన్లకు స్వస్తి పలుకుతూ క్రీడా మైదానంలోకి అడుగు పెట్టాలన్నారు. సిఆర్పిఎఫ్ పాఠశాల క్రమశిక్షణకు నిలయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ క్రీడ పాఠశాలలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో 4 బంగారు, 3 వెండి 2 కాంస్య బహుమతులు స్కూల్ క్రీడా ఫెడరేషన్ లో 2 బంగారు 2 సిల్వర్ ఒక బ్రాంజి బహుమతులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హరిశంకర్, ఆశాజికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్, భాస్కర్ రెడ్డి, మన్మధరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుని లడ్డూను 167,000లకు కైవసం చేసుకున్న కృష్ణ

**రాజేంద్రనగర్ మహా ;** గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని సిద్ధాంతి కాలనీలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోగణపతి లడ్డూ వేలంపాటలో కుక్కల కృష్ణ 167,000,లకు గణపతి లడ్డూను కైవసం చేసుకున్నారు.సిద్దాంతి ఉత్సవ కమిటీ సభ్యులు కృష్ణను శాలువాతో సత్కరించి మంగళ వాయిద్యాలతో, ఇంటి వరకు సాగనంపారు. కార్యక్రమంలో ఉత్సవా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# దసరాకు 'నాన్న కుట్టి' సందడి

**హైదరాబాద్, మహా:** తమిళ హీరో, సంగీత దర్శకుడు విజయ్ ఆంటోనీ నటిస్తున్న తాజా చిత్రం 'నాన్న కుట్టి' విడుదలకు సిద్ధమవుతోంది. ము. మారన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని విజయ్ ఆంటోనీ ఫిల్మ్స్ బ్యానర్‌పై మీరా విజయ్ నిర్మిస్తున్నారు. తండ్రి, కుమార్తె మధ్య అనుబంధం నేపథ్యంలో యాక్షన్, భావోద్వేగ అంశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 16న సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల తేదీని వెల్లడిస్తూ ప్రత్యేక పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.ఈ చిత్రానికి విజయ్ ఆంటోనీ స్వయంగా సంగీతం అందిస్తున్నారు. ప్రీతి, హరిప్రియ కథానాయికలుగా నటిస్తుండగా.. లిథన్య, భగవతి పెరుమాళ్, ముత్తుకుమార్, అరువి మధన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సినిమాలో విజయ్ ఆంటోనీ పాత్ర యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు ప్రాధాన్యతనిచ్చే విధంగా ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. తండ్రి, కుమార్తె బంధంతో పాటు కథలో థ్రిల్లర్ అంశాలు కూడా ఉండనున్నట్లు సమాచారం. తమిళంలో 'అప్పా కుట్టి' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తెలుగులో 'నాన్న కుట్టి'గా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే విడుదలైన సినిమా ప్రచార చిత్రాలు, పోస్టర్లు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. దసరా సీజన్‌లో ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. రిలీజ్ డేట్ ఖరారు కావడంతో విజయ్ ఆంటోనీ అభిమానుల్లోనూ సినిమాపై ఆసక్తి పెరిగింది.



# వైట్ లుక్‌లో మెరిసిన యుక్తి థరేజా

**హైదరాబాద్, మహా:** నటి యుక్తి థరేజా తన తాజా ఫొటోషూట్‌తో ఆకట్టుకుంది. తెల్లని స్ట్రాప్‌లెస్ క్రాప్ టాప్, ఫ్లోయింగ్ ట్రౌజర్స్‌లో స్టైలిష్‌గా కనిపించింది. సింపుల్ మేకప్, వాల్యూమ్‌డ్ కర్లీ హెయిర్‌తో తన లుక్‌ను పూర్తి చేసింది. నడుముకు ధరించిన సున్నితమైన యాక్సెసరీ ఆమె ఫ్యాషన్ స్టైల్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన యుక్తి.. 'లుట్ గయే' మ్యూజిక్ వీడియోతో విస్తృత గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత దక్షిణాది చిత్ర పరిశ్రమలో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటోంది. తెలుగులో 'రంగబలి' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె.. అనంతరం మలయాళంలో 'మార్కో' సినిమాలోనూ నటించింది. ప్రస్తుతం పలు తెలుగు, డిజిటల్ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. తాజా ఫొటోషూట్‌లో యుక్తి ప్రదర్శించిన సింపుల్, ఎలిగెంట్ స్టైల్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో ఆమె షేర్ చేసిన ఫొటోలకు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తోంది.



# ఎమరాల్డ్ గ్రీన్‌లో ప్రగ్యా జైస్వాల్

హైదరాబాద్, మహా: టాలీవుడ్ నటి ప్రగ్యా జైస్వాల్ తన తాజా ఫొటోషూట్‌తో మరోసారి అభిమానులను ఆకట్టుకుంది. ఎమరాల్డ్ గ్రీన్ రంగు కుర్తా, ఫ్లేర్డ్ ప్యాంట్‌లో సంప్రదాయ, ఆధునిక శైలుల కలయికతో కనిపించింది. ప్రత్యేకంగా డిజైన్ చేసిన కుర్తాపై ఉన్న ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. సింపుల్ మేకప్, వేవీ హెయిర్‌స్టైల్, మినిమల్ యాక్సెసరీస్‌తో ప్రగ్యా తన లుక్‌ను పూర్తి చేసింది. వివిధ భంగిమల్లో ఫొటోలకు పోజులిస్తూ కెమెరా ముందు మెరిసింది. పండుగలు, ప్రత్యేక కార్యక్రమాలకు అనువైన సంప్రదాయ దుస్తుల్లోనూ స్టైలిష్‌గా కనిపించవచ్చని ఈ లుక్‌తో చూపించింది. ప్రగ్యా షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. నెటిజన్లు ఆమె లుక్‌ను ప్రశంసిస్తూ కామెంట్లు చేస్తున్నారు. సినిమాలతో పాటు ఫ్యాషన్, ఫొటోషూట్లకు సంబంధించిన చిత్రాలను కూడా ప్రగ్యా తరచూ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటోంది. తాజా ఫొటోల్లో ఆమె ఎంచుకున్న ఆకుపచ్చ రంగు దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తులకు ఆధునిక టచ్ జోడించడం, సింపుల్ స్టైలింగ్‌తో లుక్‌ను పూర్తి చేయడం నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ఈ ఫొటోషూట్‌లో ప్రగ్యా ఇచ్చిన పోజులు కూడా ప్రత్యేకంగా నిలిచాయి. దీంతో ఆమె తాజా లుక్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది.



# రక్తంతో రణ్‌బీర్ ఫస్ట్ లుక్

హైదరాబాద్, మహా: సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'లవ్ అండ్ వార్' చిత్రంలో రణ్‌బీర్ కపూర్ ఫస్ట్ లుక్ విడుదలైంది. గురువారం మేకర్స్ విడుదల చేసిన పోస్టర్‌లో రణ్‌బీర్ పాతకాలపు కారులో డ్రైవింగ్ చేస్తూ కనిపించాడు. ఒక చేతిని కారు బయటకు ఉంచగా.. ఆ చేతికి రక్తపు గాయాలు కనిపించడం ఆసక్తిని పెంచుతోంది. వెనుకకు దువ్విన జుట్టు, గుండ్రటి సన్‌గ్లాసెస్, మీసంతో రణ్‌బీర్ సరికొత్త వింటేజ్ లుక్‌లో దర్శనమిచ్చాడు. రణ్‌బీర్‌తో పాటు అలియా భట్, విక్కీ కౌశల్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'సావరియా' తర్వాత రణ్‌బీర్‌భన్సాలీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై ఆసక్తి నెలకొంది. అలియా గతంలో భన్సాలీ దర్శకత్వంలో 'గంగూబాయి కాఠియావాడి'లో నటించగా.. విక్కీ కౌశల్‌కు భన్సాలీతో ఇదే తొలి చిత్రం. 2027 జనవరి 21న 'లవ్ అండ్ వార్'ను ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తాజాగా విడుదలైన రణ్‌బీర్ ఫస్ట్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది.








# 20 ఏళ్ల తర్వాత ఇమ్రాన్–హిమేష్ కలయిక

హైదరాబాద్, మహా: బాలీవుడ్ హీరో ఇమ్రాన్ హష్మీ, ప్రముఖ సంగీత దర్శకుడు హిమేష్ రేష్మియా దాదాపు 20 ఏళ్ల తర్వాత మరోసారి కలిసి పనిచేస్తున్నారు. 2005లో వచ్చిన 'ఆషిక్ బనాయా ఆప్నే'తో ఈ కాంబినేషన్‌కు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత 'అక్సర్' చిత్రానికి కూడా వీరిద్దరూ కలిసి పనిచేశారు. ఈ సినిమాల్లోని పాటలు అప్పట్లో యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా 'గన్‌మాస్టర్ జీ9' చిత్రం కోసం ఈ కాంబినేషన్ మరోసారి కలిసింది. ఆదిత్య దత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్, రొమాంటిక్ స్పై థ్రిల్లర్‌లో ఇమ్రాన్ హష్మీకి జోడీగా జెనీలియా నటిస్తోంది. ఈ చిత్రం కోసం హిమేష్ రేష్మియా స్వరపరిచిన 'అఫ్సానా బనాయా ఆప్నే' పాట ఇటీవల విడుదలైంది. హిమేష్, అసీస్ కౌర్ ఈ పాటను ఆలపించారు. పాటలో ఇమ్రాన్, జెనీలియా జంటగా కనిపించారు. పాత కాంబినేషన్ మళ్లీ తెరపైకి రావడంతో ఈ పాటపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. 'గన్‌మాస్టర్ జీ9' చిత్రాన్ని నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com